RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

తెలంగాణ తల్లి

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:13 FRIDAY ,MAY 15,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :13 శుక్రవారం, మే 15, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## చివరిగింజ వరకు కొంటాం



తెలంగాణ పత్రిక ప్రతినిధి

రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. గురువారం కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. - మిగతా2లో

## కేరళ సిఎం అభ్యర్థి సతీషన్‌కు రేవంత్ అభినందనలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

కేరళం ముఖ్యమంత్రిగా ఎంపికైన వీడీ సతీశన్‌కు తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.కేరళం ప్రజలకు దశాబ్దాలుగా సేవ చేస్తూ విలువలతో కూడిన రాజకీయాలు చేసే సతీశన్‌కు ఈ పదవి రావడం సముచిత గుర్తింపు అని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికార బాధ్యతలు అప్పగించారని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, అక్షరాస్యతలో కేరళం దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సతీశన్ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. - మిగతా2లో




## కార్లు వదలి.. బస్సులు, మెట్రోల్లో ప్రయాణించండి

తెలంగాణ పత్రిక ప్రతినిధి

పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, అంతర్జాతీయ చమురు సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు సూత్రాలు పాటించాలని ప్రభుత్వాలతోపాటు ప్రజలకు సూచించారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఉద్యోగులపై కేంద్రం కొత్త ఆంక్షలు విధించింది. కార్లు వదలి.. బస్సులు, మెట్రోల్లో ప్రయాణించాలని ప్రజలకు స్పష్టం చేసింది. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రత్యేక రవాణా ప్రణాళికను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ప్రభుత్వ క్వార్టర్ల నుంచి కార్యాలయాలకు వెళ్లేందుకు - మిగతా2లో



## జిన్‌పింగ్ పై ట్రంప్ ప్రశంసలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత జిన్‌పింగ్ మధ్య గురువారం బీజింగ్‌లో ఉన్నత స్థాయి సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇరు దేశాల బృందాలను ఉద్దేశించి మాట్లాడిన అధ్యక్షుడు ట్రంప్ చైనా అధినేతపై ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్‌ను కలవడం తనకు గౌరవమని, ఆయన తనకు మంచి స్నేహితుడని కొనియాడారు. ఇరు దేశాలకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. 'మా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. - మిగతా2లో



## భద్రాద్రిని దర్శంచుకున్న తుమ్మల

## ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ



తెలంగాణ పత్రిక ప్రతినిధి

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ప్రత్యేక స్వాగతం పలికారు. శ్రీ సీతారామచంద్ర స్వామికి మంత్రి ప్రత్యేక - మిగతా2లో

## పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసు

## రెక్కీ నిర్వహించి దోపిడీకి పాల్పడ్డట్లు ఎస్పీ వివరణ



తెలంగాణ పత్రిక ప్రతినిధి

కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యువెలరీ షాపులో కాల్పులు జరిపి.. నగలు దోపిడీకి పాల్పడింది సుభోద్ సింగ్ గ్యాంగ్ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జరిగాసింగ్ అని చెప్పారు. గురువారం - మిగతా2లో

## ధాన్యం సేకరణలో ఇన్ని ఇబ్బందులా



తెలంగాణ పత్రిక ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్ధత పాలన వల్ల రాష్ట్రంలోని రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో గతంలో లేని ఇబ్బందులు ఇప్పుడే ఎందుకని ప్రశ్నించారు. పెగడపల్లి మండలం కీచులాటపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో లేని ఇబ్బందులు రేవంత్ పాలనలో ఎందుకు - మిగతా2లో

## మరోమారు తెర పైకి ఫార్ముూలా కేసె

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ముూలా–ఈ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి - మిగతా2లో



## మంత్రి సీతక్కకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విజ్ఞప్తి

## స్త్రీ నిధిలో జరుగుతున్న అక్రమాల పై స్పందించాలన్న కవిత

తెలంగాణ పత్రిక ప్రతినిధి

సంస్థను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశాడని ఆరోపణ మంత్రి సీతక్కకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక విజ్ఞప్తి చేశారు. ఆమె శాఖలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలని కోరారు. స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన - మిగతా2లో



## కేరళ సీఎం అభ్యర్థి సతీషన్‌కు రేవంత్ అభినందనలు

-మొదటిపేజీ తరువాయి

పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, పరస్పర సహకారం వంటి రంగాల్లో కేరళం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. కేరళం మరింత ప్రగతి, సుసంపన్నత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## చివరిగింజ వరకు కొంటాం

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కారింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీ చేశారు.

## కార్లు వదలి.. బస్సులు, మెట్రోల్లో ప్రయాణించండి

-మొదటిపేజీ తరువాయి

మెట్రో స్టేషన్ల మీదుగా ప్రత్యేక షటిల్ బస్సులు ప్రారంభించినట్లు తెలిపింది. మెట్రో, బస్సుల్లో ప్రయాణించే ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం అదనపు రవాణా భత్యాన్ని పెంచుతామని ప్రకటించింది. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల పని వేళల్లో మార్పుల కోసం కీలక ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించింది. నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ వాడే ఉద్యోగులకు ఆ కార్డులో ముందే నగదు చెల్లించాలని నిర్ణయించినట్లు కేంద్రం పేర్కొంది. మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్, రైడ్ సదుపాయాలతోపాటు ఎలక్ట్రిక్ రిక్షాల సంఖ్యను కూడా పెంచినట్లు వివరించింది. పర్యావరణ పరిరక్షణ కోసం కార్ పూలింగ్, మెట్రో ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలను కోరింది. ముడి చమురు ధరలు పెరిగిన నేపథ్యంలో పొదుపు చర్యలు చేపట్టాలంటూ వివిధ మంత్రిత్వ శాఖలకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. సెంట్రల్ విస్టా ఏరియాలో సొంత వాహనాల వాడకాన్ని తగ్గించాలని అధికారులను ఆదేశించింది. ఉదయం 8:30 నుంచి 9:30 మధ్య ప్రతి 10 నిమిషాలకు ఒక షటిల్ బస్సు అందుబాటులో ఉంటుందని వివరించింది. ఢిల్లీలోని సెంట్రల్ విస్టా పరిధిలో తిరగడానికి 12 ప్రత్యేక బస్సులతో 'ఇన్నర్ – ఔటర్ లూప్' వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు కేంద్రం వివరించింది.

## భద్రాద్రిని దర్శంచుకున్న తుమ్మల

-మొదటిపేజీ తరువాయి

పూజలు నిర్వహించారు. తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా తొలిసారి ఎన్టీఆర్ క్యాబినెట్‌లో ప్రమాణ స్వీకారం చేసి నేటికి నలభై ఏళ్ళు పూర్తి అయ్యాయి. 1986 మే 14 తేదీన తుమ్మల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దర్శనానంతరం తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. శ్రీరాముడు అంటే భద్రాచలం అనేలా భక్త రామదాసు రామాలయం పునఃనిర్మాణం చేశారన్నారు. పూజ్యులు ఎన్టీఆర్ పాలనలో భద్రాచలం రామాలయం అభివృద్ధి చేసే భాగ్యం దక్కిందని తెలిపారు. రూ.351 కోట్లతో రామాలయం పునరాభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారన్నారు. నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో భద్రాద్రి రాముని ఆశీస్సులు ఎప్పుడూ ఉన్నాయన్నారు. భద్రాచలం ప్రాంతం నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ధాన్యం సేకరణలో ఇన్ని ఇబ్బందులా

-మొదటిపేజీ తరువాయి

వస్తున్నాయని ప్రశ్నించారు. కేసీఆర్ యకత్వంలో నీళ్లు, 24 గంటల కరెంట్, పంట పెట్టుబడి, ఎరువులు సకాలంలో అందించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చాక అంతా ఆగిపోయిందని విమర్శిం చారు. ప్రభుత్వం సక్రమంగా, సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం పంట కల్లాలోనే కుప్పల, తెప్పలుగా పోసి ఉంటున్నాయని, వర్షాల భయంతో రైతులు అరచేతుల్లో ప్రాణం పెట్టుకుని లారీల కోసం ఎదురుచూపు చూస్తున్నారని తెలిపారు. అంతేగాక బస్తాకు 3.2 కేజీ కటింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ధర్మపురి నియోజకవర్గ మంత్రి, కలెక్టర్, కాంగ్రెస్ నాయకులకు రైతుల పట్ల పట్టింపు లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాన్ని అవలంభిస్తున్నదని ఆరోపించారు. ఎన్నికల్లో రైతు డిక్లరేషన్ పేరుతో 36 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆయన గుర్తు చేశారు .

## మంత్రి సీతక్కకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విజ్ఞప్తి

-మొదటిపేజీ తరువాయి

మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పాటునివ్వాల్సిన స్త్రీనిధి సంస్థ అక్రమార్కులకు అడ్డంగా మారిందని ఆరోపించారు. సంస్థను తన గుప్పెట్లో పెట్టుకుని అనేక అక్రమాలకు కారకుడైన ఎండీ, ఇప్పుడు దొడ్డిదారిన సంస్థకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ఈ నెల 16వ తేదీన స్త్రీనిధి ఉద్యోగుల సమావేశంలో ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పోస్టును తీసుకోవడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని పేర్కొన్నారు. సదరు ఎండీ పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనుందని, దీంతో ఆయన సంస్థను ఎలాగైనా తన అధీనంలోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమార్కులను దొడ్డిదారిలో కీలక పోస్టుల కొనసాగించేందుకు ఎంతకైనా దిగజారుతోందని విమర్శించారు. తన శాఖలో జరుగుతున్న అక్రమాలపై మంత్రి సీతక్క స్పందించాలని కోరారు. స్త్రీ నిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్ర నిధిలో నియామకాలు పారదర్శకంగా జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

# జిన్‌పింగ్ పై ట్రంప్ ప్రశంసలు

-మొదటిపేజీ తరువాయి

పొరపొచ్చాలు వచ్చినప్పుడు కూడా మాట్లాడుకుని త్వరగా పరిష్కరించాము. మీరు ఒక గొప్ప నాయకుడు. ఇలా నేను మిమ్మల్ని ప్రశంసించడం కొందరికి నచ్చకపోవచ్చు. కానీ నేను ఉన్నది ఉన్నట్టు చెబుతున్నాను. చైనా, అమెరికాలు కలిసికట్టుగా అద్భుత భవిష్యత్తువైపు అడుగులు వేస్తున్నాయి ' అని ట్రంప్ అన్నారు. ఈ పర్యటన కోసం తాను అమెరికాకు చెందిన అత్యుత్తమ వ్యాపారవేత్తలను తీసుకొచ్చానని కూడా ట్రంప్ చెప్పారు. వారందరికీ చైనా అధినేత అంటే గౌరవమని చెప్పారు. ఇదే అతిపెద్ద శిఖరాగ్ర సమావేశమని కూడా వ్యాఖ్యానించారు. ఇక ఈ సమావేశాల ప్రారంభంలో చైనా అధినేత జిన్‌పింగ్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య సహకారం ఉండాలని అభిలషించారు. చైనా–యూఎస్ బంధం స్థిరంగా ఉండాల్సిన ఆవశ్యకత గురించి కూడా మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం దృష్టి తమ రెండు దేశాలపైనే ఉందని అన్నారు. గత శతాబ్దంలో చూడని మార్పులు ప్రస్తుతం జరుగుతున్నాయని చెప్పారు. అంతర్జాతీయంగా అల్లకల్లోల పరిస్థితులు ఉన్నాయని, ప్రపంచం నాలుగు రోడ్ల కూడలిలో ఉందని అభిప్రాయపడ్డారు. చైనా, యూఎస్‌లు తమ దౌత్య బంధంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని కూడా వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ శిఖరాగ్ర సమావేశంలో ఎన్‌విడియా సంస్థ సీఈఓ జెన్సన్ హువాంగ్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ సీఈఓ టిమ్ కుక్ పాల్గొంటున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, టెక్నాలజీతో పాటు తైవాన్ అంశంపై కూడా చర్చించేందుకు ట్రంప్ చైనాలో పర్యటిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, ప్యాసింజర్ విమానాలను చైనాకు మరింతగా ఎగుమతి చేసేలా ఒప్పందం కుదుర్చుకునేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు.

# పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసు

-మొదటిపేజీ తరువాయి

కరీంనగర్‌లో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ గౌస్ ఆలం విలేకర్లతో మాట్లాడుతూ ఈ దోపిడీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొత్తం 161.4 తులాల బంగారు ఆభరణాలను ఈ గ్యాంగ్ దొంగతనం చేసిందని వివరించారు. మొత్తం వీటి విలువ రూ. 82 లక్షలు ఉంటుందన్నారు. బిహార్‌కు చెందిన సుభోద్ గ్యాంగ్‌కి.. గోల్డెన్ తీఫ్‌గా పేరుందని గుర్తు చేశారు. పీఎంజే జ్యువెలరీ షాపులో ముందుగా రెక్కీ నిర్వహించి.. అనంతరం ఈ దోపిడీని ఈ గ్యాంగ్ చేసిందన్నారు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లోని మెహతాబ్ వద్ద ఈ ముఠా సెల్ ఫోన్, సిమ్స్ కొనుగోలు చేసినట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్‌లలో బంగారు షాపులపై ఈ గ్యాంగ్ రెక్కీ నిర్వహించిందని చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జాగీరా సింగ్ సహా ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను అరెస్ట్ చేశామని సీపీ తెలిపారు. వీరు నకిలీ ఆధార్, నకిలీ బైక్ నెంబర్లు, నకిలీ పేర్లతో తిరుగుతూ ఈ దోపిడీలకు పాల్పడతారని సీపీ గౌస్ ఆలం వివరించారు. రెండు నెలల ముందు ఈ గ్యాంగ్ తెలంగాణకు వచ్చిందని సీపీ గౌస్ ఆలం వివరించారు. ముగ్గురు నిందితులను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియాకు చూపించారు. నిందితులను 12 రోజుల పాటు దోపిడీ దొంగల కేసులో పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు. బంగారం దోపిడీ కేసులో సుబోధ్ సింగ్ ప్రధాన నిందితుడు అని పోలీసులు తెలిపారు. దోపిడీ తర్వాత రైలు, బస్సు ద్వారా తప్పించుకునేందకు ప్రయత్నించారు. దోపిడీకి రెండు నెలల క్రితమే రెక్కీ నిర్వహించారని పేర్కొన్నారు. ఈ గ్యాంగ్‌పై పలు రాష్ట్రాల్లో కేసులు ఉన్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్ ఝార్ఖండ్ రాష్టాల్లో్ సుబోధ్ సింగ్ ముఠా చోరీలకు పాల్పడిందన్నారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న పోలీసులను సీపీ అభినందించారు. పిస్టల్స్‌తో వచ్చిన ఐదుగురు దొంగలు.. సిబ్బందిపై కాల్పులు జరిపి సుమారు కిలోన్నరకుపైగా బంగారం ఎత్తుకెళ్లారు. దొంగలు జరిపిన కాల్పుల్లో షాపు సేల్స్ మేనేజర్ ముస్తాక్ అలీతో పాటు సిబ్బంది కమల్, మధుకర్, సెక్యూరిటీ గార్డు రాజేశ్ తీవ్రంగా గాయపడ్డారు. షాపులోకి ఎంటరైన ఐదు నిమిషాల్లోనే పని ముగించుకున్న దొంగలు.. బయటికి పరుగెత్తి పల్సర్, అపాచీ బైక్‌లపై పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు పది నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన సిబ్బందిని ఆస్పత్రికి తరలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఎంపీ బండి సంజయ్ ఆఫీస్, జిల్లా జడ్జి ఇంటికి సమీపంలోనే సినీ ఫక్కీలో భారీ చోరీ జరగడంతో తీవ్ర కలకలం రేగింది.

# మరోమారు తెరపైకి ఫార్ములా కేసె

-మొదటిపేజీ తరువాయి

ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. జులై 31న విచారణకు రావాలని కోర్టు ఆదేశించింది. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ–కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో సహా ఎఫ్ఈఓ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించింది. ఫార్ములా–ఈ కారు రేసు నిర్వహణలో జరిగిన అక్రమాలపై ఏసీబీ ఇప్పటికే లోతైన దర్యాప్తు జరిపి అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా మాజీ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ పేర్కొంది. వీరితో పాటు ఏ4గా స్పోర్ట్స్ కన్‌స్టలెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావు, ఏ5గా ఎఫ్ఈఓ సంస్థపై కేసులు నమోదయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా–ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ప్రధాన అభియోగం. హెచ్ఎండీఏ ఖాతా నుంచి సుమారు 55 కోట్ల రూపాయలను ఎఫ్ఈఓ సంస్థకు బదిలీ చేసినట్లు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. ముందస్తు అనుమతులు లేకుండానే ఇంత భారీ మొత్తాన్ని విదేశీ సంస్థకు ఎలా చెల్లించారన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అరవింద్ కుమార్ సహా పలువురు ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఏసీబీ కోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించి సమన్లు జారీ చేయడంతో.. జూలై 31న కోర్టులో ఏం జరగబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

## డీజీపీ భార్య హత్య కేసులో పురోగతి.. దేశంలోనే కల్పన గ్యాంగ్

తెలంగాణ పత్రిక మే 14

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన రిటైర్డ్ డీజీపీ వినయ్ రంజన్ రాయ్ భార్య హత్య, దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ప్రధాన నిందితురాలిగా భావిస్తున్న నేపాల్‌కు చెందిన పనిమనిషి కల్పన, ఆమె ముఠా సభ్యులు దేశం విడిచి పారిపోలేదని, దేశ సరిహద్దుల్లోనే ఎక్కడో తలదాచుకున్నారని పోలీసులు దాదాపుగా నిర్ధారణకు వచ్చారు. నిందితులను పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన 10 ప్రత్యేక పోలీస్ బృందాలు దేశవ్యాప్తంగా గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈ హత్య, దోపిడీ పక్కా ప్రణాళికతోనే జరిగిందని దర్యాప్తులో తేలింది. నిందితురాలు కల్పన ఫోన్ కాల్ డేటాను విశ్లేషించిన పోలీసులు, ఆమె ముఠా సభ్యులు నేపాల్‌కు వెళ్లలేదని స్పష్టం చేసుకున్నారు. దీంతో పూణె, ముంబై, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌తో పాటు ఇండో–నేపాల్ సరిహద్దుల్లోనూ నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ కేసులో కల్పనతో పాటు మరో ఇద్దరు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే కల్పనకు సంబంధించిన కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు, వారి ద్వారా కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. నిందితులకు ఎవరు ఆశ్రయం కల్పించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు త్వరలోనే ఓ కొలిక్కి రానుందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా



ఉండగా, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో నేపాలీ ముఠా చేసిన భారీ దోపిడీ కేసులోనూ దర్యాప్తు వేగంగా సాగుతోంది. ఈ కేసులో ఏడుగురు నేపాలీలు ఉన్నట్లు గుర్తించిన మల్కాజ్‌గిరి పోలీసులు, హైదరాబాద్ సిటీ పోలీసులతో కలిసి ఢిల్లీ సరిహద్దుల్లో గాలిస్తున్నారు. ఈ ముఠా సభ్యులు సరిహద్దు దాటి నేపాల్‌కు చేరుకున్నారా లేక దేశంలోని ఇతర నగరాల్లో తలదాచుకున్నారా అనే దిశగా విచారణ జరుపుతున్నారు.

## ప్రతికూల వాతావరణం కారణంగా హైదరాబాద్ కు రావాల్సిన రెండు విమానాల దారి మళ్లింపు

తెలంగాణ పత్రిక మే 14

హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారడం వల్ల శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. నగర శివార్లలో ఆకాశం మేఘావృతమై, ల్యాండింగ్‌కు అవసరమైన స్పష్టత లేకపోవడంతో, భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు రెండు కీలక విమానాలను దారి మళ్లించారు. పూణె – హైదరాబాద్ (ఇండిగో) విమానాన్ని విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్టుకు మళ్లించి అక్కడ సురక్షితంగా ల్యాండ్ చేయించారు. దుబాయ్ – హైదరాబాద్ (ఎమిరేట్స్) అంతర్జాతీయ విమానాన్ని బెంగళూరు విమానాశ్రయానికి డైవర్ట్ చేశారు. ఈ పరిణామాలతో ప్రయాణికులు చాలా ఇబ్బందికి గురయ్యారు. ఆ తర్వాత వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత, ఈ రెండు విమానాలు తిరిగి శంషాబాద్ చేరుకోవడంతో ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.



# నీట్ పేపర్ లీకేజీ పై జహీరాబాద్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన





-నీట్ నిర్వహణలో కేంద్రం అట్టర్ ఫ్లాప్

-యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు పట్లోళ్ళ నాగిరెడ్డి

జహీరాబాద్ ప్రతినిధి మే 14(తెలంగాణ పత్రిక )

జహీరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నీట్ యూజీ-2026 పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీపై జహీరాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం నీట్ పరీక్ష లీకేజీని నిరసిస్తూ పెద్దసంఖ్యలో యూత్ కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు ఈసందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అసెంబ్లీ అధ్యక్షులు నరేష్ గౌడ్ పట్లోళ్ళ నాగిరెడ్డి మాట్లాడుతూ నీట్ యూజీ-2026 నిర్వహణలో కేంద్రం అట్టర్ఫ్లాప్ అయిందని విమర్శించారు నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ వెంటనే కేంద్ర మానవ వనరులశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఏన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు నీట్ పరీక్షా పత్రం లీకేజీతో దేశంలోని దాదాపు 23లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం అయిందని ఆవేదన వ్యక్తంచేశారు లీకేజీ వ్యవహారంలో ఏన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని ఆరోపించారు. 2021 2024ల్లో జరిగిన లీకేజీల నుంచి గుణపాఠం నేర్చుకోలేదని మండిపడ్డారు బీజేపీ పాలిత రాష్ట్రాలు పేపర్ లీకేజీలకు కేరాఫ్గా మారాయని ధ్వజమెత్తారు ఇప్పటికైనా లీకేజీ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేకుంటే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈకార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నరేష్ బబ్లూ ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ రెడ్డి గోవర్ధన్ రెడ్డి,ప్రేమ్ సింగ్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి,సోహేల్ ఆయా మండల అధ్యక్షులు రాఘవేందర్ సునీల్ ప్రధాన కార్యదర్శులు మోహీన్ నాయకులు సంతోష్ రెడ్డి ఖాదర్ కార్తీక్ అక్బర్ అభిలాష్ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# అక్రమ బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపాలి

-సుజాతనగర్లో మద్యం సిండికేట్ దందాపై ఎస్సీ-బీసీ నాయకుల ఆగ్రహం

-కొత్తగూడెం సీఐకి వినతిపత్రం సమర్పణ

భద్రాద్రి కొత్తగూడెం క్రైం మే 14(తెలంగాణ పత్రిక)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్రమ బెల్ట్ షాపులు సామాన్య ప్రజల జీవితాలను చిదిమేస్తున్నాయని ఎస్సీ, బీసీ సంఘాల నాయకులు మండిపడ్డారు. గ్రామాలు, కాలనీలు, గిరిజన ప్రాంతాల్లో అనుమతులు లేకుండా బహిరంగంగా సాగుతున్న అక్రమ మద్యం విక్రయాలపై వెంటనే ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం పట్టణ సీఐకి వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ, ముఖ్యంగా సుజాతనగర్ ప్రాంతంలో కొందరు వ్యక్తులు సిండికేట్గా ఏర్పడి బెల్ట్ షాపులను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ శాఖ, పోలీసు యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి కారణంగా అక్రమ వ్యాపారులు మరింత రెచ్చిపోతున్నారని తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల యువత మద్యం వ్యసనానికి బానిసలవుతూ తమ భవిష్యత్తును చీకట్లోకి నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ కూలీ పనులు చేసే కార్మికులు సంపాదించిన డబ్బంతా మద్యం దందాకే వెళ్లిపోతుండటంతో కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని పేర్కొన్నారు. మహిళలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.అధికారిక ఎమ్మార్పీ ధరలకు మించి బెల్ట్ షాపుల్లో బహిరంగ దోపిడీ సాగుతోందని మండిపడ్డారు. క్వార్టర్ బాటిళ్లపై అదనపు ధరలు వసూలు చేస్తూ పేద ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రామాల్లో మద్యం సిండికేట్ల వల్ల గొడవలు, కుటుంబ కలహాలు, దాడులు పెరిగి శాంతిభద్రతలకు భంగం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.మహిళలు రాత్రివేళ బయటకు రావడానికి భయపడే పరిస్థితులు నెలకొన్నాయని, విద్యార్థులు చెడు అలవాట్ల బారిన పడుతున్నారని నాయకులు హెచ్చరించారు. గ్రామీణ యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, ఇప్పటికైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అక్రమ మద్యం వ్యాపారులకు కొందరు అధికారుల అండదండలు ఉన్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొంటూ దీనిపై



సమగ్ర విచారణ జరపాలని కోరారు. పోలీసు, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించి బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు.ప్రజల ఆరోగ్యం, కుటుంబాల భద్రత, యువత భవిష్యత్తును కాపాడేందుకు అక్రమ మద్యం వ్యాపారులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ--బీసీ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# త్వరితగతిన ధాన్యం తరలించాలి





-కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక

కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్, గంభీరావుపేట మండల కేంద్రం, మండలంలోని మల్లారెడ్డి పేట, ముస్తాఫానగర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం తనిఖీ చేశారు. లారీల కొరత లేకుండా వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్, లక్ష్మీనారాయణ ఇండస్ట్రీస్, కొత్తపల్లిలోని వాయుపుత్ర ఇండస్ట్రీస్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తనిఖీ చేసి.. ధాన్యం లారీలను వెంట వెంటనే అన్ లోడింగ్ చేయించాలని ఆదేశించారు. హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. పరిశీలనలో గంభీరావుపేట తహసీల్దార్ మారుతి రెడ్డి, అధికారులు, కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులను పరిశీలించిన జగిత్యాల జిల్లా పోలీస్ అధికారులు

-జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్,ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు.

జగిత్యాల రూరల్ (తెలంగాణ పత్రిక) మే 14

జగిత్యాల జిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా,సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగింది.ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఎస్ఐలు, సంబంధిత ఎంపీడీఓలు,ఎంఆర్వోలు, ఏపీఎంలు, ప్యాక్స్ సీఈఓలు మరియు పోలీసు అధికారులు సంయుక్తంగా పలు వరి కొనుగోలు కేంద్రాలు,రైస్ మిల్లులను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు.నఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుండి ధాన్యం సేకరణ, వరి అన్లోడింగ్ ప్రక్రియ, రవాణా వాహనాల కదలిక, వరి నిల్వ విధానం, మిల్లులకు తరలింపు తదితర అంశాలపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించారు. లారీలు, ట్రాక్టర్ల రాకపోకలు సజావుగా సాగుతున్నాయా లేదా, అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందా



లేదా, తూకం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నారా అనే అంశాలను అధికారులు పరిశీలించారు.

## నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

-ఎఫ్ సీఐ, ఎస్ డబ్ల్యూసీ, నాబార్డ్, పరిశ్రమల శాఖ, తహసీల్దార్లు ఇతర శాఖల అధికారులతో సమీక్ష



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక

జిల్లాలో నూతన గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ సీఐ), స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (ఎస్ డబ్ల్యూసీ), నాబార్డ్, పరిశ్రమల శాఖ, ఎల్ డీ ఎం తహసీల్దార్లు, మార్క్ ఫెడ్, మార్కెటింగ్ శాఖ ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎఫ్ సీఐ, ఎస్ డబ్ల్యూసీ, మార్క్ ఫెడ్ తదితర శాఖల ఆధ్వర్యంలో పంట ఉత్పత్తుల నిల్వ కోసం గోడౌన్ల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. స్థలాలు గుర్తించాలని, నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరితగతిన పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.సమావేశంలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, మార్క్ ఫెడ్ అధికారి హబీబ్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ నరసింహ, నాబార్డ్ డీడీఎం దిలీప్, పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు, ఎస్ డబ్ల్యూసీ, ఎఫ్ సీ ఐ అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సువీన్ యాదవ్ నియామకం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక






రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా సువీన్ యాదవ్ నియమితులయ్యారు. నాపై నమ్మకంతో ఈ కీలకమైన బాధ్యతను అప్పగించిన చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మరియు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సువీన్ యాదవ్ మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో, ప్రభుత్వ సంక్షేమ పథకాలను మండలంలోని ప్రతి ఇంటికీ చేరవేసేందుకు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ,నియోజకవర్గ మరియు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు, ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## పేదల సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం- గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం విలాసాగర్ గ్రామంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులు గాలిపెల్లి మమత--రమేష్ దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య హాజరై గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పేదల సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని పేర్కొన్నారు, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తూ, సంక్షేమ పథకాల అమలులో ముందుంటుందని తెలిపారు,గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు,ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మిరుదొడ్డి శ్రీనివాస్ మరియు మాల్యారి రమేష్,జేపీ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గత పదేళ్లలో జరగని అభివృద్ధి ఇప్పుడు చొప్పదండిలో జరుగుతోంది: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక



మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో చొప్పదండి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గత పది సంవత్సరాల్లో జరగని అనేక అభివృద్ధి పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని తెలిపారు.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురించి విమర్శలు చేసే ముందు, గతంలో ఎన్ని అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, 2029లో కూడా కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చొప్పదండిలో మరోసారి కాంగ్రెస్ జెండా ఎగరవేసి, భారీ మెజార్టీతో మేడిపల్లి సత్యం విజయం సాధిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా పరిపాలన, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు సోషల్ మీడియా జాగిరి వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం

ముధోల్: మే14(తెలంగాణ పత్రిక):



రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెడుతుందని ముధోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముద్గల్ గ్రామంలో సునీత- రాహుల్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ ఆయన చేతుల మీద కూడా ప్రారంభించారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ముందుకెళుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులు గృహప్రవేశం చేయడం ఆనందంగా ఉందన్నారు. లబ్దిదారు లను శాలువాతో సన్మానించి శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, నాయకులు బెజ్జంకి సాయ రెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.ద

## అల్వాల ధర్మయ్య కుటుంబాన్ని పరామర్శించిన కన్నం సుదర్శన్



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక

అల్వాల ధర్మయ్య ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో కుటుంబంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారి వదినగారు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే కన్నం సుదర్శన్ స్పందించి, అల్వాల ధర్మయ్య కలిసి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వదిన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కుటుంబ సభ్యులను కలిసి, ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన సహాయం అందించేందుకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు కన్నం సుదర్శన్ పరామర్శకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయంలో నాయకులు, స్నేహితులు అండగా నిలవడం కుటుంబానికి మానసిక ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు.

# గంజా గస్తీపై పోలీసుల అవగాహన

-ముధోల్ సీఐ రవీందర్ నాయక్

ముధోల్14ఏప్రిల్(తెలంగాణ పత్రిక)



మండలంలోని విట్టోలి ,బోరిగాం గ్రామాల్లో జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా గాంజా గస్తీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టినట్లు ముధోల్ సీఐ రవీందర్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడు తూ ..మత్తు పదార్థాల వినియోగంవల్ల కలిగే దుష్ప్రభావాలపై గురించి ఆటో డ్రైవర్లకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, వినియోగం, రవాణా చేసినట్లు తెలిస్తే పోలీసులకు సమా చారం అందజేయాలన్నారు. వారి పేరును గోప్యంగా ఉంచడం జరుగుతుంద న్నారు.గంజాయి నిర్మూలి ంచడమే పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. ఇంతకు ముందు వరి కొనుగోలు కేంద్రాలలో సిఐ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై బిట్ల పెర్సిస్,పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

# 29 వ వార్డు లో నూతన బోర్







భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 14

29వ డివిజన్ పరిధిలో గల న్యూ గొల్లగూడెం నందు దా : అలీ బాబా ఇంటి ముందు డివిజన్ కార్పొరేటర్ మల్హోత్రా సాగర్ డివిజన్ లో వేసవి కాలంలో ప్రజలకు అత్యవసరమైన త్రాగు నీటిని అందించడానికి దిగ్విజయంగా 3 వ బోర్ ను వేయించడం జరిగినది. ఈ సందర్భంగా డివిజన్లో ఉన్న ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ మల్హోత్రా సాగర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని డివిజన్ పెద్దలు మాజీ స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు, షేక్ జానీ, ఎత్తు సమ్మయ్య, పాసికంటి రమేష్, బొమ్మిసెట్టి కిరణ్, రామాచారి, టెంట్ హౌస్ ప్రకాష్, మారపల్లి రవి, నీలం పుల్లయ్య, బుధారపు శ్రీను,బుధారపు వెంకన్న, కొబ్బరి కాయలు కొట్టి బోర్ పనులు ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ కార్యకర్తలు మల్హోత్రా కుమార్, వేముల పవన్, లేతాకుల నాగరాజు,సాగంటి రవి, చింతల రాము, రేగుల రాజేష్, లగిశెట్టి ప్రసాద్, గుడిసె శ్రావణ్, బుధారపు చరణ్, మహమ్మద్ జఫ్ఫు, గుఱ్రాల సాయి, వెలిశాల పవన్, డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో బాల్యమిత్రుడు మేడ సుధాకర్ మృతి






-మేమంతా ఉన్నామంటూ.. స్నేహితుడి కుటుంబానికి అండగా.. 50 వేల రూపాయల ఆర్థిక సాయం

గూడూరు మండల ప్రతినిధి మే 14. (తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా, తమతో కలిసి మెలిసి తిరిగిన స్నేహితుడు రోడ్డు ప్రమాదం లో మృతి చెందగా.. అతని కుటుంబానికి అండగా మేమున్నామంటూ... తోటి స్నేహితులు ముందుకొచ్చారు. మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం కార్లాయి గ్రామానికి చెందిన మేడ సుధాకర్, గతవారం రోజుల కిందట రోడ్డు ప్రమాదానికి గురై బుధవారం మృతి చెందాడు. సుధాకర్ రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని విషయం తెలుసుకున్న, గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2001-2002 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులంతా కలిసి సుధాకర్ మెరుగైన ఆరోగ్యం కోసం తమవంతుగా తొలిసారి, 40 వేల రూపాయలు ఆర్థికసాయం అందజేసి, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. తదానంతరం సుధాకర్ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న స్నేహితులంతా కలిసి, నర్సంపేట మార్చురీకి తరలివెళ్లి అతని భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తదానంతరం బాల్యస్నేహితుని కుటుంబానికి మేమున్నామంటూ... గుండె ధైర్యాన్ని ఇస్తూ.. గురువారం సుధాకర్ అంతక్రియల కోసం ఆయన కుటుంబ సభ్యులకు మరో 10 వేల రూపాయలు అందజేశారు. రెండు దఫాలుగా మొత్తం 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి బాల్యమిత్రులు వారి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో 10వ తరగతి బాల్య స్నేహితులు గుఱ్రపు యాకాంబ్రం, పెసరి శివ, మేరెడ్డి సురేందర్, బెజ్జం కరుణాకర్, జక్కోజు రాజేందర్, కోలా శ్రీనివాస్, కామగాని నవీన్, హరికృష్ణ, నాగరాజు, యాకుబ్ పాషా, బీరయ్య, హుస్సేన్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## రుద్రంగి, చందుర్తి ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత





సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక

రుద్రంగి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల పురోగతిని తనిఖీ చేసి అవసరమైన సూచనలు చేశారు. అలాగే రుద్రంగి మండలం పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రంతో పాటు చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు అనుమాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో నిర్వహిస్తున్న వైద్య సేవలు, రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా వడదెబ్బకు సంబంధించిన మందులు తగినంత అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అలాగే ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకొని ఏఎన్ఎంలు గ్రామాల్లో ఓఆర్ఎస్ కార్నర్లు ఏర్పాటు చేసి ప్రజలకు వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు.ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది మరియు కార్తీక్ పాల్గొన్నారు.

# అబ్బాపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీనామా

గొల్లపల్లి మండలం (తెలంగాణ పత్రిక) మే 14

అబ్బాపూర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జక్కుల ధనంజయ్ పార్టీలో విలువలు లేకపోవడం,విపక్షకు గురికావడంతో ఈరోజు కాంగ్రెస్ పార్టీకి,గ్రామ శాఖ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు.ప్రభుత్వ పనితీరు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వడ్ల కొనుగోలు, ఐకెపి సెంటర్లలో సక్రమంగా జరగకపోవడంతో రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు పూర్తి భరోసా ఉండేది, ఇలాంటి సమస్యలు లేవు అని అన్నారు. ఇకపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరి ప్రజల కోసం పని చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.



# రాష్ట్రవ్యాప్తంగా 16వ తేదీన జరిగే స్త్రీ నిధి ఉద్యోగుల సమావేశాన్ని జయప్రదం చేయండి

**-స్త్రీ నిధి ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మూడు సంపత్ కుమార**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 14

16వ తేదీన రాష్ట్ర పంచాయతీరాజ్ సంక్షేమ మాత్యులు గౌరవ మంత్రివర్యులు సీతక్క సమక్షంలో ప్రజాభవన్ లో నిర్వహించనున్న స్త్రీ నీది ఉద్యోగుల సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులందరూ హాజరుకావాలని పిలుపునివ్వడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమం పై కొంతమంది బయట వ్యక్తులు దుష్ప్రచారాలు చేస్తున్నారు స్త్రీ నిధిలో ఎటువంటి యూనియన్లు గాని అసోసియేషన్లు గానీ లేవు స్త్రీ నిధిలో ఉన్న ఏకైక యూనియన్ స్త్రీ నిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ మాత్రమే ఈ యూనియన్ ఉద్యోగుల సంక్షేమం కోసం స్త్రీ నిధి సంస్థ బాగోగుల కోసం మాత్రమే పనిచేస్తుంది కొంతమంది నకిలీ వ్యక్తులు శ్రీనిధి ఉద్యోగులుగా చలామణి అవుతూ తాము స్త్రీ నిధి ఉద్యోగులుగా రాష్ట్ర కార్యవర్గంలో ఉన్నట్లు కొన్ని పత్రికలలో స్టేట్మెంట్లు ఇచ్చుకుంటూ నకిలీ వ్యక్తులుగా చలామణి అవుతున్నారు అటువంటివారిని నమ్మకండి. రాష్ట్రస్థాయిలో నిర్వహించే సమీక్ష సమావేశం ఇది వ్యక్తిగత సమావేశం కాదు ఉద్యోగుల బాగోగుల కోసం భవిష్యత్ తరాలకు శ్రీనిధి సంస్థ ప్రయోజనాలు చేకూర్చడానికి ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే కార్యక్రమంలో విజన్ 2047 లో భాగస్వామ్యం అయి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో స్త్రీ నిధి ప్రత్యక్ష పాత్ర ఉంది ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడానికి చేపట్టిన కార్యక్రమమే రేపు 16వ తారీకు ప్రజాభవన్లో నిర్వహించే సమావేశం కానీ కొంతమంది బయట వ్యక్తులు సమస్త సిబ్బందిపై దుష్ప్రచారం చేసి కొంతమంది వ్యక్తుల ఉద్యోగాలు పోస్టులు కాపాడుకోవడానికి మాత్రమే నిర్వహి



స్తున్నారని తప్పుడు దుష్ప్రచారం చేస్తున్నారు ఇట్లాంటి వాటిని నమ్మి ఎవరు మోసపోకండి శ్రీనిధి సంక్షేమం కోసం మాత్రమే నిర్వహించే సభ ఇద కాబట్టి ఉద్యోగ మిత్రులందరికీ ఈ సమావేశానికి హాజరై జయప్రదం చేయగలరని కోరుతున్నాం.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండల పరిధిలోని చిర్లవంచ, గుర్రవానిపల్లె గ్రామాలతో పాటు వేములవాడ పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసిన, వారికి నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం గుర్రవానిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన బస్సు షెల్టర్‌ను ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని,ఆ దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

**-గాదె శ్రీనివాస చారి ఉద్యమకారుల మండల అధ్యక్షులు**

మంగపేట,మే 14:(తెలంగాణ పత్రిక)

ములుగు జిల్లా మంగపేట మండలంలో ఈ రోజు విలేకర్ల సమావేశం లో ఉద్యమకారుల మండల అధ్యక్షులు గాదె శ్రీనివాస చారి మాట్లాడుతు అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు శ్రీనివాస్ చారి డిమాండ్ చేస్తున్నారు.ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తామని మేనిఫెస్టోలో పెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సుమారు మూడు సంవత్సరాలు గడిచిన గాని ఇంతవరకు ఇప్పటికైనా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదు, కొద్ది రోజుల క్రితం ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం కమిటీ వేస్తానని చెప్పడం జరిగింది ఇప్పటివరకు ఏ కమిటీ వేయలేదు కాలయాపన చేస్తూ జాతీయం తప్ప ఉద్యమకారులకు ఇప్పటివరకు వరగబెట్టింది ఏమీ లేదు ఇకనైనా 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలి లేకపోతే తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు రాస్త రోకోలు చేపడతామని డిమాండ్ చేస్తున్నాం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో రూపొందించిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం 25 వేల పెన్షన్ హెల్త్ కార్డు, ఐడెంటి కార్డు, బస్సు పాస్, అందజేయాలని డిమాండ్



చేశారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అదనపు కలెక్టర్

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 14

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ కార్యక్రమంపై భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి,జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, ఈసిఐ నెట్ యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈఆర్ఓ లు,ఏఈఆర్ఓ లు, బిఎల్ఓ లకు యాప్‌ను ఏ విధంగా ఉపయోగించాలి,వివరాలను ఎలా నమోదు చేయాలి, ఫీల్డ్ స్థాయిలో సమాచారం సేకరణ విధానం తదితర అంశాలపై అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు.అలాగే ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, వేగం మరియు సమన్వయం పెంచేందుకు




తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ఎన్నికల అధికారులు పలు సూచనలు చేశారు. ఎన్నికల సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఏవో కిషన్, డిపిఆర్ఓ నరేష్, ఏడిఎం మమత,ఐటీ టీమ్ సభ్యులు మరియు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పాపన్నపేట, ప్రతినిధి మే 14:(తెలంగాణ పత్రిక)

జీవితంపై విరక్తి చెంది యాసిడ్ సేవించి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లంపేట గ్రామంలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...గ్రామానికి చెందిన కోట నారాయణ(58) గత కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధపడు తున్నాడు.పక్షవాతం కారణంగా ఏ పని చేసుకోలేక పోతున్నానని అంటూ తరచూ చనిపోతా కుటుంబీకులతో బాధపడుతుండేవాడు.ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన నారాయణ ఈనెల 10న రాత్రి సమయంలో ఇంట్లో ఉన్న యాసిడ్ సేవించి గట్టిగా అరవడంతో కుటుంబీకులు అడగడంతో యాసిడ్ సేవించానని తెలిపాడు.చికిత్స నిమిత్తం అతన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు.మృతుడి కొడుకు రాములు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



# తిరుపతమ్మ గోపయ్య అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి

**-కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి**



వేములపల్లి ప్రతినిది :మే 14(తెలంగాణపత్రిక ):-

గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి అన్నారు నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని ఆమనగల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుపతమ్మ గోపయ్య, అంకమ్మ తల్లి, నాగులమ్మ తల్లి దేవాలయాల్లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో భక్తి భావం పెంపొందడంతో పాటు సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. తిరుపతమ్మ గోపయ్య అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలని ప్రజలు సంప్రదాయాలను పరిరక్షిస్తూ భక్తిశ్రద్ధలతో దేవతలను ఆరాధించాలని సూచించారు.

# జయశంకర్ బడిబాట ర్యాలీ



గూడూరు మండల ప్రతినిధి:- మే 14. (తెలంగాణ పత్రిక):-

మహబూబాబాద్ జిల్లా,గూడూరు మండల కేంద్రంలో ని బాలుర ఉన్నత పాఠశాల నుండి గూడూరు సెంటర్ వరకు, మండల విద్యాశాఖ అధికారి ఆడెపు సుజాత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గూడూరు పోలీస్ సబ్ ఇన్ స్పెక్టర్ బి. గిరిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్పించాలని ఎంఈఓ ఆడెపు సుజాత తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య లభిస్తుందని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాంకుడోత్ రాముడు, హరి శంకర్, శ్రీనివాస్, సంధ్యారాణి, యాకలక్ష్మి సులోచన, జయశ్రీ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అలాగే విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**-ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం**
**- ఊర్కొండ మండలంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యటన**

ఊర్కొండ మే 14 (తెలంగాణ పత్రిక)



నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని రాచాలపల్లి, రేవల్లి, గుడిగానిపల్లి గ్రామాలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో కలిసి గురువారం విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామాలలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, విద్యుత్ సరఫరా, మిషన్ భగీరథ తాగునీటి సదుపాయాలు, అంతర్గత రహదారులు, పారిశుధ్యం తదితర అంశాలను ఎమ్మెల్యే మరియు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.అలాగే గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన పనులపై స్థానిక ప్రజలు, గ్రామ పెద్దల అభిప్రాయాలను సేకరించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి



ముధోల్: 14మే(తెలంగాణ పత్రిక)

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని అష్ట సర్పంచ్ రావుల లావణ్య – శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 4వ రోజు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. అష్ట పభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు వంద ఉత్తీర్ణత, గురుకుల ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు పొందడం మన గ్రామానికి గర్వకారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఉచితంగా దుస్తులు,పుస్తకాలు మధ్యాహ్న భోజనము వీటితోపాటు బ్యాగు, టై, బెల్టు షూస్ లను అందజేస్తారని తెలిపారు. అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలలోనే మన పిల్లల్ని చేర్పించి వారికి మంచి భవిష్యత్తును కల్పిద్దామని సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు, గ్రామస్తులను కోరారు. అదేవిధంగా పాఠశాలలో ఉత్తమ హాజరు శాతాన్ని నమోదు చేసిన ఉపాధ్యాయులకు ప్రశంస పత్రాలను మండల విద్యాధికారి రమణ రెడ్డి తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజ్జూర్ సాయిరెడ్డి,బంగారు సురేష్, విట్టల్, వెంకట్, సిఆర్పీ రాములు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో కూలీ మృతి

–పొగుళ్లపల్లిలో విషాదం



కొత్తగూడ మండల ప్రతినిధి:– మే 14. (తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం పొగుళ్ల పల్లి గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పడాల రమేష్ అనే వ్యక్తి వడదెబ్బకు గురై మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ?గ్రామం లోని మందగడ్డ వద్ద వడ్లు నింపే పనులకు కూలీగా వెళ్లిన రమేష్‌కు, ఒక్కసారిగా తీవ్రమైన తలనొప్పి రావడంతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఇంటికి చేరుకున్న , కొద్దిసేపటికే ఆయన మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్ఐ రాజ్ కుమార్ ప్రాథమిక సమాచారం సేకరించారు. కూలీ పనులకు వెళ్లి ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. దీనితో రోడ్డున పడ్డ పడాల రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని పొగుళ్లపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఎల్లమ్మ తల్లి పూజా కార్యక్రమంలో పాల్గొన్న హరిపురం సర్పంచ్ దంపతులు



ఓదెల/ తెలంగాణ పత్రిక (మే 14)

ఓదెల మండలంలోని గోపరపల్లి గ్రామంలో గీతా కార్మికుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ తల్లి అభిషేకం నవగ్రహాల పూజా కార్యక్రమంలో హరిపురం సర్పంచి గ్యార వేణి విజయ నాగరాజు పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు రేణుక ఎల్లమ్మకు నిర్వహించి పట్టు వస్త్రాలు అలంకరణ చేసి ఎల్లమ్మ తల్లి పూజా కార్యక్రమంలో పాల్గొని తల్లి ఆశీర్వాదం పొందారు . ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు తోట ఐలయ్య గౌడ్ కాసారపు చిన్న ఐలయ్య కాసారపు బిక్షపతి మహేశ్వర్ గౌడ్ తోట గట్టయ్య మల్లయ్య రమేష్ ముంజాల మల్లయ్య హరిపురం గోపరపల్లె గ్రామ మహిళలు రైతులు గౌడ సంఘం నాయకులు రేణుక ఎల్లమ్మ పూజా కార్యక్రమానికి హాజరయ్యారు

# విద్యా వారోత్సవాల్లో పాల్గొన్న పాలక వర్గ సభ్యులు





తెలంగాణ పత్రిక/దమ్మపేట(మే 14)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99రోజుల ప్రణాళికలో భాగంగా మే 11 నుండి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా వారోత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా దమ్మపేట పంచాయతీ పరిధిలో పలు ప్రాథమిక పాఠశాలలో, జెడ్పిహెచెస్ లో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, చాట్ల శ్రీనివాసరావు, బత్తుల సాయి, ఉయ్యాల లక్ష్మీనారాయణ, దాసరోజు సరిత రామారావు, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, పసుమర్తి కుసుమాంబ, ధర్మసోతు పద్మ తదితరులు గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని పాఠశాలల మౌలిక సదుపాయాలు, విద్య నాణ్యతను పెంచడం, బడిబాట కార్యక్రమాల ద్వారా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయ సిబ్బంది ద్వారా తల్లి తండ్రులకు వివరించారు. ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యం విద్యారంగ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నందున, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించడం ఉత్తమం అని పాలక వర్గ సభ్యులు తెలియజేశారు.

# మేడ సుధాకర్ మృతి - ప్రజా సంక్షేమానికి తీరని లోటు

–వారి భౌతిక కాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి, నివాళులర్పించిన కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ



కొత్తగూడ మండల ప్రతినిధి మే 14. (తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండల కేంద్రం పరిధిలోని కార్లయికి చెందిన, ఫీల్డ్ అసిస్టెంట్ మేడ సుధాకర్ ఇటీవల బైక్ ప్రమాదవశత్తులో తీవ్రంగా గాయపడగా, తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క కు దృష్టికి రాగానే వారి ఆదేశాల మేరకు, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రి కి తరలించారు. చికిత్స పొందుతున్న తరుణంలో తుదిశ్వాస విడిచారు. వీరు మృతి చెందిన విషయం తెలియగానే మంత్రి సీతక్క, వారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. నేడు సీతక్క సూచనల మేరకు కార్లాయి వారి స్వగృహంలో వారి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి, మనోధైర్యాన్ని కల్పించి వారి కుటుంబానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని, సంక్షేమ పథకాలలో భాగంగా మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు రూఫ్ సింగ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు వీరనేని వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ జనరల్ సెక్రెటరీ నోముల ప్రశాంత్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ యూత్ మాజీ మండల అధ్యక్షుడు బోయినేని ప్రశాంత్ రెడ్డి, సర్పంచ్ పెనుక సిరి వెన్నెల కిషోర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గడ్డం వెంకన్న , గ్రామ కమిటీ నాయకులు, తదితరులు నివాళులు అర్పించారు.

# అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం





–ఇందిరమ్మ ఇండ్లు పూర్తయిన ఇండ్లకు గృహప్రవేశం

–నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 14 (తెలంగాణ పత్రిక):

అర్హులైన ప్రతి పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఇందిరమ్మ ఇండ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో గురువారం రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేసిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి లబ్ధిదారులకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడారు. ఇందిరమ్మ గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారుల ముఖాల లో ఆనందం చూసి ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల వలన పేదల జీవితాల్లో వస్తున్న మార్పులను చూసి ప్రశంసించారు పార్టీలకు అతీతంగా గ్రామాల్లో ఉన్న ప్రతి నిరుపేదలకు రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో ప్రతి లబ్దారునికి ఇందిరమ్మ గృహ పథకం కింద ఇండ్లు మంజూరు చేయించి కట్టించే బాధ్యత నాదేనని సూచించారు. మండల కేంద్రంలోని కోట కింద వాడలో గృహప్రవేశం చేసిన వారి కళ్ళలో ఆనందం చూసి సంతోషించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి జిల్లా నాయకుడు మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి సుధాకర్ గౌడ్ తలారి మల్లేష్ నరసింహారెడ్డి శేఖర్ గౌడ్ శంకర్ గౌడ్వెల్దుర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మల్లేష్ చారి దండు రాములు ముక్తాబాయ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ముగిసిన మరిపెడ వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభ

–అధ్యక్ష,కార్యదర్శులుగా బాణాల రాజయ్య,ఎండి ఇమామ్ సాబ్ ఎన్నిక..



మరిపెడ,మే14(సూర్యరేఖ)

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి గ్రామంలో మాజీ మండల ప్రధాన కార్యదర్శి గుండగాని మధుసూదన్ అధ్యక్షత నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం 10వ మహాసభ ముగింపు కార్యక్రమానికి సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి అలవాల వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ...గత మహాసభ నుంచి ఇప్పటి వరకు పనిచేసిన అధ్యక్షులు,కార్యదర్శులు,మండల కమిటీ సభ్యులు,గ్రామ కార్యదర్శులను అభినందించారు. గత మూడు సంవత్సరాలుగా మండలంలోని గిరిపురం,బావోజిగూడెం, తానంచర్ల, ఎల్లంపేట, అబ్బాయిపాలెం తదితర గ్రామాలు, తండాలలో కూలీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసి, కూలీల వేతనాలను గతంతో పోలిస్తే పెంచగలిగామని తెలిపారు. దేశం,రాష్ట్రాల్లో పేదరికం పూర్తిగా నిర్మూలన అయ్యే వరకు కూలీలు,భూమి సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి కూలీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. మహాసభలో కొత్త మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాణాల రాజయ్య, కార్యదర్శిగా ఎండి ఇమామ్ సాబ్, ఉపాధ్యక్షులుగా బయ్య నీరజ,తాళ్ల ఎల్లమ్మ, కోశాధికారిగా పూలేపాక నవీన్,కమిటీ సభ్యులుగా యామినినారాయణ సత్యం, బోడపట్ల లచ్చమ్మ, వడ్లకొండ ఉప్పలయ్యలను ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన గుండగాని మధుసూదన్‌ను భవిష్యత్తు అవసరాల దృష్ట్యా సంఘ బాధ్యతల నుంచి రిలీవ్ చేసినట్లు అలవాల వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తాటికొండ అనంతాచారి,తూము విజయ్, సీనియర్ నాయకులు సత్యం, సీతావెంకన్న, అల్లీ శ్రీనివాస్ రెడ్డి,ఎస్కే అమీనా,వడ్లకొండ తిరుపమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 22వ తేదీన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభ

-నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి
-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక

ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా ఈ నెల 22వ తేదీన శుక్రవారం జిల్లా స్థాయి సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 22 వ తేదీన శుక్రవారం జిల్లాస్థాయి సభ నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం సమీక్షించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సభలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరు గ్యారంటీలు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కరపత్రం రూపొందించాలని, దానిని కార్యక్రమంలో అందజేయాలనితెలిపారు.లబ్ధిదారుల అభిప్రాయాలను అందరికీ వివరించాలని పేర్కొన్నారు. మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, వివిధ పథకాల లబ్ధిదారులను ఆహ్వానించాలని ఆదేశించారు. అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.సభలు తెలంగాణ రాష్ట్ర గీతం (జయ జయహే తెలంగాణ) స్వాగతోపన్యాసం, పరిచయం అలాగే సీఎం గారి సందేశం వినిపించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న రకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల వివరాలు, సాధించిన విజయాలపై శాఖల ద్వారా సమాచారం ఇవ్వాలని, లబ్ధిదారుల పేర్లను చదవాలని, లబ్ధిదారుల అభిప్రాయాలు, అనుభవాలు చెప్పాలని తెలిపారు. ఇప్పటి దాకా అమలు చేస్తున్న వాటిపై చర్చించాలని, భవిష్యత్లో చేపట్టనున్న పనులపై తీర్మానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.



-ఈ నెల 18 నుంచి పర్యాటక శాఖ, యువజన వారోత్సవాలు

ఈ నెల 18 వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పర్యాటక శాఖ, యువజన వారోత్సవాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 18 వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 2 కే రన్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఈ నెల 21వ తేదీన షెడ్యూల్ ప్రకారం ప్లే అండ్ పార్టిసిపేట్ స్పోర్ట్స్ డే లో భాగంగా సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలకు హాజరవుతున్న పిల్లలతో స్పోర్ట్స్ డే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ నెల 22 వ తేదీన పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, అదే రోజు జిల్లా స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, 23 వ తేదీన మెగా జాబ్ మేళా చేపట్టాలని తెలిపారు. మిగతా కార్యక్రమాలు ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు.సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, పరిశ్రమల శాఖ అధికారులు హనుమంతు, భారతి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి మండల కేంద్రంలో లబ్ధిదారులకు 5 లక్షల 36 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





-నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 14 (తెలంగాణ పత్రిక):

వెల్దుర్తి మండల వ్యాప్తంగా ఉన్న పలు లబ్ధిదారులకు గురువారం మండల కేంద్రంలో 5 లక్షల 36వేల విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను నరసపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ సహాయం అందిస్తుం దన్నారు. అనారోగ్యానికి గురైన యాక్సిడెంట్లకు గురైన హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రయోజనాలు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి నరసింహారెడ్డి సుధాకర్ గౌడ్ తలారి మల్లేష్ తలారి హనుమేష్ శేఖర్ గౌడ్ శంకర గౌడ్ ముక్తాబైవెల్దుర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మల్లేష్ చారి పోతిరెడ్డి అందుగులపల్లి శ్రీనివాస్ వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# "ఫోన్ ట్యాపింగ్ కేసు: రేపు 'సిట్' ముందుకు గంప ప్రసాద్

-విచారణకు హాజరుకావాలని కామారెడ్డి డీసీసీ ఉపాధ్యక్షుడికి నోటీసులు
-హైదరాబాద్‌లోని సిట్ కార్యాలయంలో విచారణ

కామారెడ్డి, మే 14,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 'ఫోన్ ట్యాపింగ్' కేసు విచారణలో భాగంగా కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులకు నోటీసులు అందడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక బృందం కామారెడ్డి డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్ కు నోటీసులు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సైబర్ టవర్స్‌లోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అధికారులు ఆదేశించారు. అక్రమ ట్యాపింగ్‌పై లోతైన విచారణ గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తలు,జర్నలిస్టుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్న ఆరోపణలపై ప్రస్తుత ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి జిల్లాలో జరిగిన పరిణామాలు, ట్యాపింగ్‌కు సంబంధించి తనకు తెలిసిన సమాచారాన్ని సేకరించేందుకు గంప ప్రసాద్‌ను అధికారులు పిలిచినట్లు తెలుస్తోంది.ఈ మేరకు కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు పత్రికా ప్రకటన విడుదల చేశారు. పిసిసి రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, చాట్ల రాజేశ్వర్, లక్కపత్తిని గంగాధర్,వడ్ల సురేష్, టింకు భరత్ తదితరుల సమక్షంలో ఈ వివరాలను వెల్లడించారు. సిట్ జారీ చేసిన నోటీసుల ప్రకారం గంప ప్రసాద్ విచారణకు హాజరై తన వాంగ్మూలాన్ని నమోదు చేయనున్నారని నేతలు పేర్కొన్నారు.



# రాజంపేట మండలంలో జనగణన ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి ,మే 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లారాజంపేట మండలంలో నిర్వహిస్తున్న సెన్సస్--2027 జనగణన ఇంటింటి సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహణ, వివరాల నమోదు, డేటా సేకరణ ప్రక్రియలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి ఇంటిని కవర్ చేస్తూ ఎటువంటి కుటుంబం మిగలకుండా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేలో సేకరించే సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని, డిజిటల్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరించి సహకారం పొందాలని తెలిపారు. జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు కీలకమని పేర్కొన్న కలెక్టర్, అధికారులు నిర్దేశిత గడువులోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న ఇంటిని దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సర్వే సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా కక్కిరాల రమేష్

తెలంగాణ పత్రిక/దమ్మపేట మే 14



దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా కక్కిరాల రమేష్ ను నియమిస్తున్నట్లు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గురువారం ప్రకటించారు. ఈ నియామకంపై నూతన అధ్యక్షుడు కక్కిరాల రమేష్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న మరియు సహకరించిన ప్రతీ ఒక్క మండల సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కక్కిరాల రమేష్ నియామకం పట్ల దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

## దాబా ముసుగులో అక్రమ మద్యం దందా: చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

ఇల్లంతకుంట మే 14 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మహా మార్ట్ సూపర్ మార్కెట్ నుండి ముస్కాన్‌పేట వెళ్లే దారి మధ్యలో ఉన్న దాబాలో అనుమతులు లేకుండానే బహిరంగంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.దాబా ముసుగులో సిట్టింగ్‌లు వేయించి యథేచ్ఛగా మద్యం సేవించేందుకు అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. ఒక్కో బాటిల్‌పై ఎమ్మార్పీ కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ అక్రమ విక్రయాలతో యువత, కూలీలు మద్యానికి బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాబాపై పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే ఆకస్మిక దాడులు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా దాబాలో ఆహార నాణ్యతపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక



పెగడపల్లి మండలం పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గన్నేబోయిన చంద్రయ్య (49) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు.కోరం గ్రామం శివారులో కౌలుకు తీసుకున్న మామిడి తోటలో వేసిన కరెంటు వైర్‌ను తొలగించే క్రమంలో, ఆ వైర్‌ను చేతికి చుట్టుకుంటూ తీసుకెళ్తుండగా మధ్యలో ఉన్న జాయింట్ వద్ద విద్యుత్ ప్రవహించి ఎడమ చేతి మణికట్టుకు షాక్ తగిలింది. దీంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలి పోయారు.వెంటనే కుటుంబ సభ్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎం. శ్రీనివాస్ తెలిపారు.

## విద్యా వారోత్సవాల్లో పాల్గొన్న పాలక వర్గ సభ్యులు




తెలంగాణ పత్రిక/దమ్మపేట(మే 14)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక 99రోజుల ప్రణాళికలో భాగంగా మే 11 నుండి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా వారోత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా దమ్మపేట పంచాయతీ పరిధిలో పలు ప్రాథమిక పాఠశాలలో, జెడ్పిహెచెస్ లో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, చాట్ల శ్రీనివాసరావు, బత్తుల సాయి, ఉయ్యాల లక్ష్మీనారాయణ, దాసరోజు సరిత రామారావు, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, పసుమర్తి కుసుమాంబ, ధర్మసోతు పద్మ తదితరులు గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని పాఠశాలల మౌలిక సదుపాయాలు, విద్య నాణ్యతను పెంచడం, బడిబాట కార్యక్రమాల ద్వారా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయ సిబ్బంది ద్వారా తల్లి తండ్రులకు వివరించారు. ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యం విద్యారంగ అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నందున, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించడం ఉత్తమం అని పాలక వర్గ సభ్యులు తెలియజేశారు.

# మాడ్గులపల్లి మండల కేంద్రంలో ఘనంగా పిడమర్తి రవి జన్మదిన వేడుకలు



మాడుగుల పల్లి//నల్గొండ//మే 14:(తెలంగాణ పత్రిక):-

బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి తెలంగాణ ఉద్యమ రదసారధి తెలంగాణ మాజీ ఎస్ సి కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి జన్మదిన వేడుకలు మాడుగులపల్లి మండల కేంద్రం లో తెలంగాణ బహుజన రాష్ట్ర సమితి జిల్లా ఇంచార్జి పుల్లెశీల సతీష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం సతీష్ మాట్లాడుతు తెలంగాణ ఉద్యమం లో క్రియ శిలకంగా పాల్గొన్నారు అని వందల పైకు కేసులు వంద రోజుల పైగా జైలు జీవితం గడిపారు అని పుల్లెశీ ల సతీష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లో ప్రముఖ పాత్ర పోషించిన పిడమర్తి రవి కి తగిన పదవి ఇవ్వక పోవడం బాధకరం అని అన్నారు. ఇప్పటి కి అయినా గుర్తుంచి తగిన ప్రధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రక్త దాత వేణు ఊర, దర్శనం చిట్టి బాబు, మేడి రాజు, నవీన్ గౌడ్, ప్రేమ్ కుమార్, శ్రవణ్ యాదవ్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం

-చలివేంద్రాన్ని ప్రారంభించిన...సర్పంచ్ ప్రసన్న రాబర్ట్




మాడ్గులపల్లి/నల్గొండ/మే 14:(తెలంగాణ పత్రిక):-

మాడ్గులపల్లి మండల పరిధిలోని కుక్కడం గ్రామం అద్దంకి నార్కెట్పల్లి హైవేపై ఉండడంతో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలు, బాటసారుల సౌకర్యార్థం గ్రామ సర్పంచ్ ప్రసన్న రాబర్ట్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షకీరా బేగం, గ్రామ పెద్దలు, యువకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జనగణన-2027 ఇంటి గణన, ఇంటి జాబితా తయారీపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి, మే 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



జనగణన-2027లో భాగంగా మొదటి దశలో చేపడుతున్న ఇంటి గణన, ఇంటి జాబితా తయారీ కార్యక్రమం పై గురువారం కామారెడ్డిజిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు పలు సూచనలు చేసి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నియమించబడిన ఎన్యూమరేటర్లు అందరూ తమకు కేటాయించిన హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ పరిధిలో ద్వారా వివరాలను నమోదు చేయాలని సూచించారు.క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు, పట్టణ ప్రాంతాల్లో వార్డ్ అధికారులు, బిల్ కలెక్టర్లు ఎన్యూమరేటర్లకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో టామ్‌టామ్, శానిటేషన్ వాహనాల ద్వారా జనగణనపై విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి , మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు.ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉదయం లేదా సాయంత్రం వేళల్లో వివరాల సేకరణ చేపట్టాలని సూచించారు.జనగణనలో భాగంగా ప్రజలు ఎన్యూమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి, దేశ అభివృద్ధికి అవసరమైన గణాంకాల సేకరణలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## మొక్కజొన్న రైతులు అధైర్యపడొద్దు

-మొక్కజొన్నలకు లారీలు వస్తాయి : సి.ఐ. వస్రా వినయ్ కుమార్

కొత్తగూడ మండల ప్రతినిధి మే 14. (తెలంగాణ పత్రిక)



మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు, గూడూరు సి.ఐ. వస్రా వినయ్ కుమార్, ఎస్.ఐ. రాజ్ కుమార్ లు గురువారం రోజున సందర్శించారు. ?ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న పంటను తరలించేందుకు తగినన్ని లారీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, రాబోయే రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి లో మొక్కజొన్నల తరలింపు ప్రక్రియను పూర్తి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

# రాజన్న ఫౌండేషన్ ద్వారా ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం

-నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 14 (తెలంగాణ పత్రిక):

రాజన్న ఫౌండేషన్ ద్వారా ప్రజలకు సేవ చేయడమే నా పరమ విధిగా లక్ష్యంగా పెట్టుకున్నానని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తి మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజానికం అనేక సమస్యలతో ఉన్నారన్న సమాచారంతో జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు తన సొంత నిధులతో మంచినీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలో నిరుద్యోగంతో విలవిలలాడుతున్న విద్యార్థిని విద్యార్థులకు రాజన్న ఫౌండేషన్ ద్వారా జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించడంజరిగిందన్నారు. గర్భిణీలు పౌష్టికాహారంతో బాధపడుతున్నారని నిరుపేదలు తమ ఆరోగ్యం సరైన సమయంలో ఆస్పత్రిలో చూయించుకోక కూనరిల్లుతున్నారు అన్న సమాచారంతో వారి వారి సమస్యలను తీర్చడానికి మంచి సౌ హృదయపూర్వక సేవ చేసే భాగ్యంగా నాకు భగవంతుడు ఆరోగ్యం ప్రసాదించాడని ప్రజాసేవే మాధవ సేవగా భావిస్తూ రాజన్న ఫౌండేషన్ ద్వారా ముందుకు సాగుతున్నానని తెలిపారు. గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లను పంపించడం జరిగిందన్నారు. శరీరంలో అన్ని భాగాలలో కెల్లా ప్రధాన భాగం కండ్లు అని అవి మంచిగా ఉంటేనే ప్రపంచాన్ని చూడగలమని సదుద్దేశంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రాజన్న ఫౌండేషన్ ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా మందులను కంటి అద్దాలను పంపించడం జరుగుతుందన్నారు. అందులో



భాగంగానే మండల కేంద్రంలో శనివారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ రాజన్న ఫౌండేషన్ ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేసి మందులతో పాటు కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేయ.

# వరి, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ,మే 14 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లారాజంపేట మండలంలోని రాజంపేట, అరగొండ, ఎల్లారెడ్డిపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, లిఫ్టింగ్ తదితర పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకు అవసరమైన లారీలు, హమాలీలను తగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కాంటా వేసి మిల్లులకు తరలించే చర్యలు చేపట్టాలన్నారు.రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాల పరిశీలనలో పారదర్శకత పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా లారిలో లోడింగ్ చేస్తున్న ప్రక్రియ ను దగ్గరుండి పరిశీలించారు. రాజంపేట మండలం, అరగొండ సహకార సంఘంపరిధిలోని అరగొండ గ్రామంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న సేకరణ కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. సందర్శన సమయంలో లారీలోడింగ్ పనులను దగ్గరుండి పరిశీలించారు. మిగిలి ఉన్న మొక్కజొన్నను వెంటనే సేకరించేలా తగిన సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేయాలని, అలాగే సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన గోదాములకు తరలించేందుకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని ను కలెక్టర్ ఆదేశించారు.ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని వరి, మొక్కజొన్న నిల్వలో ఎటువంటి నష్టం



జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యాన్ని భద్రపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.ఈ పర్యటనలో డీఎస్ఓ తహసీల్దార్, ఎంపిఓ, ఎంఈఓ లు, సర్పంచులు, వ్యవసాయ సహకార సంఘాలు చైర్మన్లు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్ష సమావేశం





-ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ ప్రతి గింజలు మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది

మిర్యాలగూడ ప్రతినిధి//మే 14:(తెలంగాణ పత్రిక):-

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుల వ్యవహారాల, ఆహార ఒ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిధిలోని ఉదయాధిత్య భవన్ లో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నల్గొండ,సూర్యాపేట మరియు యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మరియు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలతో కలిసి పాల్గొన్నరు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను మిషన్ మోడ్‌లో వేగవంతం చేయాలని సూచించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడటం, రవాణాకు ఆటంకం లేకుండా లారీలను అందుబాటులో ఉంచడం మరియు లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని మంత్రి ని కోరారు. ముఖ్యంగా అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ప్రతి ఐకేపీ సెంటర్ మరియు రైస్ మిల్లు వద్ద పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని అన్నారు. అన్నదాతల ప్రయోజనాలే పరమావధిగా, కొనుగోళ్లలో జాప్యం లేదా నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ, ప్రతి గింజను మద్దతు ధరతో సేకరించేందుకు కట్టుబడి ఉంది. రైతులకు ఇబ్బందులు లేకుండా వేగంగా ధాన్యం కొనుగోళ్లు. అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దిశా కమిటీలో పొట్లపల్లి సర్పంచ్ మద్దెల సమ్మయ్యకు స్థానం

తెలంగాణ పత్రిక, పినపాక ప్రతినిధి, మే 14.

ఐదుగురు సభ్యులతో కూడిన దిశా కమిటీలో పినపాక మండలం నుంచి పొట్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ మద్దెల సమ్మయ్య నామినేట్ అయ్యారు. ఈ సందర్భంగా పినపాక మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తనకు దిశా కమిటీలో అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రజల సమస్యలను కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదివాసీ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తన వంతు సేవలు అందిస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన నాయక త్వానికి న్యాయం చేసేలా పనిచేస్తానని మద్దెల సమ్మయ్య తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**-కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

కామారెడ్డి, మే 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతి నిధి)

యాసంగి 2025-26 సీజన్‌లో కామారెడ్డిజిల్లాలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్ , జిల్లా సహకార అధికారి ,జిల్లా మార్కెటింగ్ అధికారి డి.ఎం. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రీజినల్ మేనేజర్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తీసుకువస్తున్న మొక్కజొన్నను వేగవంతంగా కొనుగోలు చేసి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లా సహకార అధికారి మండలాల వారీగా కొనుగోలు చేయాల్సిన మొక్కజొన్న నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సొసైటీ స్థాయిలో హమాలీల సంఖ్యను పెంచి, కొనుగోలు చేసిన మొక్కజొన్నను ప్రతిరోజూ గిడ్డంగులకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రీజినల్ మేనేజర్‌కు ఇప్పటికే గుర్తించిన గోడౌన్లను వెంటనే స్వాధీనం చేసుకొని



వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అలాగే అన్‌లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీల సంఖ్యను పెంచి, ప్రతిరోజూ వాహనాలు పూర్తిస్థాయిలో అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.లారీ రవాణా కాంట్రాక్టర్ అవసరమైన లారీల సంఖ్యను పెంచి, మొక్కజొన్న రవాణా ప్రక్రియ ఎటువంటి ఆలస్యం లేకుండా నిరంతరాయంగా కొనసాగించేలా చూడాలని సూచించారు. అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు జిల్లాలో అదనపు నిల్వ సామర్థ్యం గల గోడౌన్లను గుర్తించి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అలాగే డి.ఎం. MARKFED, అదనపు కలెక్టర్ జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# సుఖపడటం కంటే ధర్మంగా బ్రతకడం గొప్ప

**-లెక్చరర్ ఉమాశేషారావు వైద్య**

కామారెడ్డి ,మే 14,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

అల్లుడు ఏమన్నా అంటే ఇంటికొచ్చేయ్, ప్రేమ పెళ్లి ళ్ళుపెద్దలుచేసినపెళ్ళిళ్ళు ఏవైనా కానివ్వండి. పెళ్లి జరిగినవారాలు,నెలల్లోనే విఫలమవడం ఒకభయం కరమైన సామాజిక సమస్య. దీనిని ఉపేక్షించగల మానీకు అత్తవారింట్లో ఏ కాస్త ఇబ్బంది అనిపించి నా, నీ భర్త కాసింత బాధ పెట్టినా వెంటనే మా దగ్గ రకు వచ్చేయ్ మేము చూ సుకుంటాం. ఇదీ నేడు చాలామంది ఆడపిల్లలకు వాళ్ళ తల్లిదండ్రులుచేస్తు న్నబోధ. ఈ బోధతలకెక్కిం చుకున్న అమ్మాయి అడుగడుగు నా అనుమానంతో నే అత్తింట్లో మసలుతుంది. భర్తతో ఏమాత్రం సర్దు బాటు చేసుకోలేని అసహనాన్ని' పెంచుకుంటుంది. నిజానికి పుట్టింటి భరోసా అవసరమేఅది కాపు రా న్ని నిలబెట్టడానికే గానీ విడదీసి వినోదించడానికి కాదు.ఇలాంటి తల్లి దం డ్రులు ఉంటారా? అని వెనకటి తరాల వాళ్ళు ఆశ్చర్యపోవచ్చు.కానీ చాలా చోట్లనఇప్పుడు ఇలాంటి వారిని చూస్తుండడం వలన ఇది వాస్తవ మని అంగీక రించక తప్పడం లేదు.పెద్ద ఎత్తున నిశ్చి తార్థాలు జరుపుకున్న వారు కూడా పెళ్లిముహూర్తం లోపలే రద్దయింది అని ప్రకటిస్తున్నారు.పెళ్లి అయ్యాకనే సులభంగా తెగ తెంపులు చేసుకున్నప్పుడు నిశ్చితా ర్థాలను రద్దు చేసుకోవడంలో అబ్బురమే ముందని అంటున్నారు.ఈ పెద్దలు తమ కాపురాలు సర్దుబాటు లేకుండా చేసుకొచ్చా రా మరి అదే సర్దుబాటు పి ల్లలకెందుకు నేర్పడం లే దుమంత్రాలు,పెళ్లితంతు జీవం లేని ప్రక్రియలా? యౌవనంలో జీవితపు లోతు వాస్తవ చిత్రం అవగాహన కావడం కష్టమే .కానీ, ఎదురైన కాసింత ఇ బ్బందిని కూడా సహిం చలేక వెంటనే విడ గొట్టుకు నేందుకు సిద్ధమవుతున్న స్వార్థబుద్ధి, సుఖ లాలన కారణంగా జీవిత స్వరూపాన్ని అవగాహన చేసుకోవడం లేదు. ఎందుకు నిన్ను చేసుకున్నానో తెలియదు. ఇప్పుడు మాత్రం నీతో బతకడం కష్టం. మనం విడిపోతే మంచిది అని అమిత తేలికగా అనేస్తున్నారు. ఇలా అంటుంటే పెద్ద లుం డి ఏం చేస్తున్నారు. ఈ స మయంలోనే వారు కలగ జేసుకుని వివాహబంధం, కుటుంబం, పిల్లల భవి ష్యత్తు వ్యవస్థ, సామా జిక భద్రత లాంటి వాస్త వాలను వివరించ గలగాలి. ఆవేశాల పొంగులు అణిగాక ఆలోచన స్థిలర త్వాన్ని ఇస్తుంది.' అని చెప్పగలగాలి. సుఖపడటం కంటే ధర్మంగా బ్రత కడం గొప్ప అని బోధ పరచ గలగాలి. వీటన్నంటికీ బదులుగా 'ఈ కాలం పిల్లలకు ఎవరు చెప్పగల రండి? వాళ్ళిష్టం'అనేసి ఊరుకుంటున్నారు. ఆర్థిక లావా దేవీలు, స్వేచ్ఛ, కట్టుబాటులో ఇమ డలే నితనం వంటి కారణాలు చూపి విడిపోయేందుకు ముందుకు వస్తున్నారు. చిన్నప్పటి నుంచి సుఖ జీవన సోపానాలే భోదిం చే తల్లిదండ్రులు పిల్లలు విలువలతో జీవించాలి అనే ధర్మజీవనపు పునా దులను నేర్పడం లేదు.నేటి యౌవనం ఇలాగే ఉండదు. మారి తీరు తుంది. జీవితం యొక్క వికృత పార్శ్వాలు క్రమేపీ గోచరిస్తాయి. సుఖదుఃఖాల సంగమమైన బ్రతు కు లో ఒక దుఃఖాన్ని ఓర్చు కోలేక సవరించలేక బం ధాన్ని తెంచిపోతే.. మరో రూపంలో మరో దుఃఖం రాక తప్పదు. అప్పుడు దానిని ఏం చేయగలం? ఇంక ఎవరికోసం బ్రతికి ఏం ప్రయోజనం? నాది అని ఏ బంధాన్ని నిలు పుకోగలం? సహిస్తూ పడమంటారా? అని ప్రశ్నించిన తరం కాసింత కూడా సర్దుకు పోవడానికి అలవరుచుకోని స్వార్థ పరత్వం లోకి ఎదిగిపో యింది. కొద్ది దశాబ్దాలుగా భయంకరమైన తెగ తెం పులువిజృంభిస్తున్నాయి. విదేశీ సంస్కృతి వెనుక మనకున్నంత బలీ య మైన కుటుంబ వ్యవస్థలు లేవు కనుక వారి చీలికల పద్ధతులను వేలెత్తి చూప నక్కరలేదు.లేని వాళ్ళకు ఎలాగూ లేదు. తమ కు న్న దానిని వదులుకోవడం ఒక విధమైన పరమ దరి ద్రం. తమ కుటుంబాల ప్రాచీన నేపథ్యాలు, సం ప్రదాయాలలోని పరస్పర గౌరవం, సహనాలతో సాగిన అనుబంధాలు బాల్యం నుండి అలవాటు పరచాలి. ఆలోచనా ధోరణి లోనే వేర్పాటుతనం ఏర్పాడుతోంది. పిల్లల తుంటరితనానికి పెద్దల తొందరపాటు తోడు కారాదు. అనుబంధాలు కడ దాకా నిలిపే ప్రయత్నమే నిజమైన జీవకళ.

# నీట్ పేపర్ లీకేజీలపై కింద ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి

**-దోమకొండ సర్పంచ్ ఐ రే ని నరసయ్య**

కామారెడ్డి,మే 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ సహా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో వరుసగా వెలుగులోకి వస్తున్న పేపర్ లీకేజీలపై కాంగ్రెస్ యువ నాయకుడు దోమకొండ సర్పంచ్ ఐరేని నరసయ్య తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఎవరూ ఆటలాడవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. పోటీ పరీక్షలకు విద్యార్థులు ఎన్నో కష్టాలు పడి సిద్ధమవుతున్న సమయంలో పేపర్ లీకేజీలు చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమని నరసయ్య పేర్కొన్నారు. ముఖ్యంగా నీట్ వంటి కీలక జాతీయ పరీక్షల సమయంలో హాస్టళ్లలో ప్రశ్నపత్రాలు అమ్ముతున్నారనే ఆరోపణలు రావడం ఆందోళనకరమని అన్నారు. పరీక్షల నిర్వహణలో భద్రతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే జోక్యం చేసుకుని పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు తీవ్రంగా శ్రమిస్తున్న నేపథ్యంలో కనీసం పోటీ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా పలు పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీలు చోటుచేసుకున్నాయని గుర్తు చేసిన ఐరన్ నరసయ్య,అలాంటి పరిణామాల వల్ల విద్యార్థులు, నిరుద్యోగుల్లో అసంతృప్తి పెరిగిందన్నారు. అదే పరిస్థితి దేశవ్యాప్తంగా పునరావృతం కాకూడదని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కఠిన చర్యలు తీసుకొని పేపర్ లీకేజీల నియంత్రణకు చర్యలు ప్రారంభించారని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను




వేగవంతం చేశారని ఆయన అభినందించారు. తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తును దెబ్బతీసే విధానాలు నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

# ఓటర్ల నమోదు కార్యక్రమంలో అఖిలపక్షాల భాగస్వామ్యం అవసరం: ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక

వేములవాడలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారిని అఖిలపక్ష నేతలు సన్మానించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి మాట్లాడుతూ, ఓటర్ల నమోదు కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ బూత్‌కు అన్ని రాజకీయ పార్టీల తరఫున ఒక్కొక్క బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ)ను నియమించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పరంగా కూడా ప్రతి బూత్‌కు ఒక్కొక్క బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ)ని నియమించినట్లు చెప్పారు.బీఎల్ఓలు, బీఎల్ఏల సమన్వయంతో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల చేర్పులు, మార్పులు సక్రమంగా నిర్వహించాలని, బోగస్ ఓటర్ల నమోదు కాకుండా చూడాలని, మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని, డబుల్ ఓటర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఓటర్ల పేర్లు, చిరునామాలు తప్పులేకుండా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ నేత వి. నిత్యానందరావు, బీఆర్ఎస్ నేత పొలాస నరేందర్, బీజేపీ నేత పిన్నింటి హన్మాండ్లు, టీడీపీ నేత చింతలకోటి రామస్వామి



గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, డీపీఓ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు లేని నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత

**-దంపతులకు నూతన వస్త్రాలు అందజేసిన నాయకులు**



కామారెడ్డి ,మే 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ఇల్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచి, ఇందిరమ్మ గృహ నిర్మాణాలను మంజూరు చేస్తుందని కామారెడ్డి జిల్లా దోమకొండ మండల మాజీ జెడ్పిటిసి సభ్యుడు తీగల తిరుమల్ గౌడ్ అన్నారు. దోమకొండలో గురువారం గోసానిపల్లి రాజమణి -భాస్కర్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం సందర్భంగా సర్పంచ్ ఐరెని నర్సయ్య,తీగల తిర్మల్ గౌడ్ నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ కృషితో దోమకొండ మండలంలో 433 ఇల్లు మంజూరు అయ్యాయన్నారు. 422 ఇళ్ల నిర్మాణాలకు మార్కవుట్ చేయగా, 346 బేస్మెంట్ లెవల్, 223 గోడ లెవెల్, 168 స్లాబ్ లెవెల్, 24 ఇల్లు పూర్తిస్థాయిలో నిర్మాణం జరగాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ కృషితో ఇల్లు లేని నిరుపేదలు గూడు నిర్మించుకొని నివాసముంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అనంతరెడ్డి, దోమకొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం మధు, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, నాయకులు నర్సింలు, అంజశీ, శంకర్ రెడ్డి, శేఖర్,సిద్ధారెడ్డి, నర్సారెడ్డి, సుధాకర్, నయీం , బాలరాజు, రాజయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్య - ఉత్తమ ఉపాధ్యాయులు : ఎంఈఓ నాగయ్య.



తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, మే 14.

-ఉపాధ్యాయులు - తల్లిదండ్రుల సమావేశాలు, బడిబాట కార్యక్రమాలు నిర్వహణ.పినపాక మండలంలో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని ఎంఈఓ నాగయ్య తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పినపాక మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు -- తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి, ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన, రెండు జతల యూనిఫామ్‌లు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, కంప్యూటర్ విద్య, యోగ, కరాటే శిక్షణ, బాలికలకు సైకిళ్లు, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు.అలాగే వారంలో మూడు రోజులు గుడ్లు, మూడు రోజులు రాగి జావా అందిస్తున్నారని, ఈ విద్యా సంవత్సరంనుంచి 11 వస్తువులతో కూడిన కిట్‌ను కూడా విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా అనుభవం కలిగిన ఉపాధ్యాయుల ద్వారా ఒత్తిడి లేని విద్యను బోధిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమాల్లో మండల విద్యాధికారి కొమరం నాగయ్య, ప్రధానోపాధ్యాయులు కె. రమణ, కె. విజయలక్ష్మి, టి. మాధవరావు, గ్రామ సర్పంచులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

మిర్యాలగూడ ప్రతినిధి//మే 14:(తెలంగాణ పత్రిక):-



నీట్ పరీక్ష పత్రం లీకేజ్ లో కేంద్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ నల్గొండ జిల్లా మిర్యాలగూడ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజారుద్దీన్ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పదేళ్ల పాలనలో 89 సార్ల వివిధ పరీక్షలు పత్రాలు లీక్ కావడం దేశ వ్యాప్తంగా విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం అని అన్నారు. నీట్ పరీక్ష పత్రం లీగ్ కారణంగా దేశవ్యాప్తంగా 22లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు తీవ్ర గందరగోళంలో పడ్డారని చెప్పారు విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న లీ. కుంభకోణాలను ప్రోత్సహిస్తున్న బిజెపి ప్రభుత్వంన్ని వెంటనే డిస్మిస్ చేయాలని వారు అన్నారు.

# బక్రీద్ పండగకు పటిష్ట భద్రత

**-జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**


కామారెడ్డి, మే 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



రానున్న బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకునేందుకు కామారెడ్డిజిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 24 గంటలు పనిచేసే ప్రత్యేక జిల్లా పోలీస్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్రతెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రధాన సరిహద్దు ప్రాంతాల్లో ఆరు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని ఎస్పీ వివరించారు. అనుమానాస్పద ఘటనలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 87126 86133 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. వాహనాలను ఆపడం, తనిఖీలు చేయడం వంటి అధికారం కేవలం ప్రభుత్వ విభాగాలకే ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. వ్యక్తులు లేదా సంస్థలు స్వయంగా తనిఖీలకు దిగితే చట్టపరంగా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే పోస్టులు, మత సామరస్యాన్ని దెబ్బతీసే వీడియోలు ప్రచారం చేసే వారిపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులతో సహకరించాలని కోరారు.

## నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**-జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు**



కామారెడ్డి, మే 14, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లానిజాంసాగర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన కళ్యాణ లక్ష్మి -- షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీకాంతరావు కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అనంతరం అచ్చంపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని లింగంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇంద్రమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు , డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న గృహపథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వున్నమ్ బిక్షమయ్య ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు



మిర్యాలగూడ ప్రతినిధి//మే 14:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ పట్టణానికి చెందిన బిక్షమయ్య వెన్నుముక సంబంధిత అనారోగ్యంతో బాధపడుతు హైదరాబాద్‌లో చికిత్స పొందిన ఉన్నం బిక్షమయ్య ని మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు పరామర్శించారు. మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, వివేకానంద కాలనీలోని వారి స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు వారిని ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి అందరూ జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. వారి వెంట సాధినేని శ్రీనివాసరావు, మోహన్ రావు, సురేష్, శివ, బాలు, రాజు, తదితరులు ఉన్నారు.

# జిల్లా డిగ్రీ బాలికల హాస్టల్ భవన పనుల్లో వేగం పెంచాలి





**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-జిల్లా డిగ్రీ బాలికల హాస్టల్ భవనం, మినీ స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన**
**-చంద్రగిరి కొనుగోలు కేంద్రంలో తనిఖీ**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14, తెలంగాణ పత్రిక

వేములవాడ మండలం అగ్రహారంలో జిల్లా డిగ్రీ బాలికల హాస్టల్ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా డిగ్రీ బాలికల హాస్టల్ భవన నిర్మాణ పనులు కొనసాగుతుండగా, గురువారం జిల్లా కలెక్టర్ పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.

**-అధికారులకు సూచనలు..**

వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆర్టీసీ డిపో సమీపంలో నిర్మిస్తున్న మినీ స్టేడియం పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులు, గ్రౌండ్, వివిధ ఆటల కోసం నిర్మించిన గదులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.

**-కొనుగోలు కేంద్రంలో తనిఖీ**

వేములవాడ మండలం చంద్రగిరిలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కుప్పలు పరిశీలించి.. ధాన్యం తూకం, తరలింపు తదితర విషయాలపై ఆరా తీశారు. ధాన్యం తరలింపునకు లారీలు సమకూర్చాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. పరిశీలనలో వేములవాడ ఆర్డీఓ కేవీస్ బీ కుమారి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఫరీద్‌పేట్‌లో గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం బహిష్కరణ

**-సర్పంచ్ నర్సింహారెడ్డిపై వార్డు సభ్యుల తిరుగుబాటు**

కామారెడ్డి ,మే 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంఫరీద్‌పేట్ గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశం గురువారం తీవ్ర ఉద్రిక్తతల మధ్య జరిగింది. గ్రామ నిధుల వినియోగంలో పారదర్శకత లేదని ఆరోపిస్తూ వార్డు సభ్యులు తగిరంచ రమాదేవి, దేవోల్ల ప్రత్యూష, జ్యోతి, వెంకట్ స్వామి గౌడ్, నర్సింలు, సమావేశాన్ని మధ్యలోనే బహిష్కరించారు. బాడీ తీర్మానం లేకుండా, వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా భారీ మొత్తంలో బిల్లులు తీసుకున్నారాని వార్డు సభ్యులు ఆరోపించారు. ముఖ్యంగా కేవలం నాలుగు నెలల్లోనే 11 లక్షల వరకు బిల్లులు తీసుకున్నారాని, కానీ పాత పెండింగ్ బిల్లులు ఇంకా క్లియర్ చేయలేదని మండిపడ్డారు. సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ వార్డు సభ్యులకు చెప్పకుండా, తీర్మానం లేకుండా డబ్బులు ఎలా తీశావని నీ సొంత నిర్ణయాలు, వ్యవహారాలు చూసి ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి వచ్చిందని డిమాండ్ చేశారు. అయితే సర్పంచ్ జీడిపల్లి నర్సింహ రెడ్డి మరియు ఉపసర్పంచ్ నుండి సరైన సమాధానాలు రాకపోవడంతో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2026లో తీసుకున్న బిల్లులకు 2023, 2024 జియో - ట్యాగ్ ఫొటోలు ఎందుకు ఉన్నాయి? పాత పనులను కొత్త పనులుగా చూపించారా? అంటూ సభ్యులు నిలదీశారు. మేము పాత బకాయిలు చెల్లించాలని కోరినప్పుడు, సర్పంచ్ గారు 'నేను 30 లక్షలు ఖర్చు పెట్టి గెలిచాను అందరికీ ఇస్తూ పోతే నాకు ఏమి మిగులుతుంది' అని మాట్లాడటం మాకు తీవ్ర బాధ కలిగించింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా, పంచాయతీ కార్యాలయానికి వెళ్లినప్పుడు వార్డు సభ్యుల ఫోన్లు తీసుకుని పక్కన పెట్టిన, తర్వాత మాట్లాడండి అని చెప్పడం ప్రజాప్రతినిధులను అవమానించే విధంగా ఉందని ఆరోపించారు. పాత బకాయిలు ఇప్పటికీ చెల్లించలేదు కానీ ఎంపిక చేసుకుని కొంతమందికి మాత్రమే బిల్లులు క్లియర్ చేస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. ఈ సందర్భంగా సభ్యులు మీడియాతో మాట్లాడుతూ గ్రామ ప్రజలు మమ్మల్ని నమ్మి గెలిపించారు. కానీ ఇప్పుడు గ్రామంలో జరుగుతున్న ఆర్థిక వ్యవహారాలు చూసి ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి వచ్చింది. గ్రామ ప్రజల డబ్బుపై స్పష్టత లేకపోవడం చాలా బాధాకరం. గ్రామంలో జరుగుతున్న కొన్ని నిర్ణయాలు చూసి మేమే ప్రజల ముందు తలదించుకునే పరిస్థితి వచ్చింది అని భావోద్వేగానికి గురయ్యారు. సర్పంచ్ నర్సింహారెడ్డి గతంలో బి ఆర్ ఎస్పార్టీలో వైస్ ఎంపీపీగా, ఇంచార్జ్ ఎంపీపీగా ఉన్న సమయంలో కూడా ఇలాంటి ఆరోపణలు రావడం ఇప్పుడు గ్రామ ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీస్తోందని పేర్కొన్నారు. ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలి కానీ వార్డు సభ్యులను పట్టించుకోకుండా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని మండిపడ్డారు. అవసరమైతే తదుపరి రాజకీయ నిర్ణయాలు కూడా తీసుకుంటామని వార్డు సభ్యులు హెచ్చరించారు.

# బీఆర్ఎస్ పార్టీ నుంచి కోలేటి భవానీశంకర్ సస్పెన్షన్ : పగడాల సతీష్ రెడ్డి

తెలంగాణ పత్రిక, పినపాక ప్రతినిధి , మే 14:



పార్టీ కార్యకలాపాలు, సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరించినందుకు పినపాకకు చెందిన కోలేటి భవానీశంకర్‌ను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పినపాక మండల బీఆర్ఎస్ అడహాక్ కమిటీ ప్రకటించింది. ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో నిర్వహించిన ముఖ్య కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా మండల అడహాక్ కమిటీ అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతూ కాంగ్రెస్ పార్టీ మంత్రిని ప్రశంసిస్తూ ప్రెస్‌నోట్లు విడుదల చేయడం, ప్రెస్‌మీట్లు నిర్వహించడం పార్టీ వ్యతిరేక చర్యగా గుర్తించామని, ఇతర మండలాల్లోని బీఆర్ఎస్ నాయకులకు ఫోన్లు చేసి కాంగ్రెస్ పార్టీ మంత్రిని కలవాలని, సంబరాల్లో పాల్గొనాలని కోరడం కూడా తప్పుగా నిర్ధారించామని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ మంత్రిని పొగడడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్లనే భవానీశంకర్‌పై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇకపై కోలేటి భవానీశంకర్‌కు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పొనుగోటి భద్రయ్య, దాట్ల వాసుబాబు, పీఏసీఎస్ చైర్మన్ రవివర్మ, పోలిశెట్టి సత్తిబాబు, గుమ్మడి గాంధీ, రాయల బాబు, బత్తుల వెంకటరెడ్డి, దొడ్డా శ్రీనివాస్ రెడ్డి, కొండేరు నాగభూషణం, ముక్కు నాసర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరిక్ష రద్దుతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం భాద్యులపై కఠిన చర్యలు తీసుకో వాలి

**-ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై నరోత్తం**

జహీరాబాద్ ప్రతినిధి మే 14(తెలంగాణ పత్రిక )



దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ -యూజీ 2026 పరీక్షను ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేయడం లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమే. పరిక్షా వ్యవస్థలో వరుసగా జరుగుతున్న లోపాలు, పేపర్ లీకుల వల్ల విద్యార్థులలో నమ్మకాన్ని దెబ్బతిస్తున్నాయి. విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి పరిక్ష వ్రాస్తే ప్రభుత్వ అసమర్ధతో లీకుల పేరుతో రద్దు చేయడం వారి తల్లిదండ్రులకు మోయలేని ఆర్థిక భారం విద్యార్థులకు తీరని నష్టం ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు వారంతా నెలల తరబడి కష్టపడి సిద్ధమై తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారు నీట్ పరిక్ష నిర్వాహణలో జరిగిన నిర్లక్ష్యానికి బాద్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకొని ఇక ముందు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఎన్ టిఏకు డిమాండ్

# బిజినెస్

## రిలయన్స్ గ్రూపులో ఆకాశ్ అంబానీకి కీలక పదవి



తెలంగాణ పత్రిక మే 14

జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆకాశ్ అంబానీ నియమితులయ్యారు. రిలయన్స్‌కు చెందిన ఈ డిజిటల్ సేవల సంస్థ ఐపీవోకు వెళ్ళనుంది. ఈ నేపథ్యంలో ఆకాశ్ అంబానీని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఏప్రిల్ 9వ తేదీ నుంచి ఈ నియామకం అందుబాటులోకి వచ్చినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఐదేళ్ల కాలం పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని మే 7వ తేదీన సమర్పించిన ఫైలింగ్‌లో పేర్కొంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు సన్నద్ధమవుతున్న వేళఈ నియామకం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఏడాది మే నెలాఖరున లేదా జూన్ నెలలో ఐపీవోకు సంబంధించిన ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించే అవకాశం ఉంది. టెలికం విభాగమైన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డులో 2014 అక్టోబర్ నుంచి ఆకాశ్ అంబానీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022 జూన్ నెలలో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆకాశ్ అంబానీ నేతృత్వంలో జియో 2016లోనే కేవలం ఆరు నెలల వ్యవధిలో 10 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకుంది. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.30 వేల కోట్ల నికర లాభాన్ని రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది.

## ప్రభుత్వ చర్యల అంచనాలతో పెరిగిన సెంటిమెంట్..
# వరుసగా రెండో రోజూ మార్కెట్ల జోరు

తెలంగాణ పత్రిక మే 14

భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా భారీ లాభాలను నమోదు చేశాయి. గురువారం ట్రేడింగ్‌లో ఫార్మా, హెల్త్‌కేర్, మెటల్, బ్యాంకింగ్ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు 1 శాతానికి పైగా లాభపడ్డాయి. కరెన్సీ అస్థిరతను నియంత్రించేందుకు ప్రభుత్వం విధానపరమైన చర్యలు తీసుకుంటుందన్న అంచనాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 789.74 పాయింట్లు (1.06%) పెరిగి 75,398.72 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 277 పాయింట్లు (1.18%) లాభపడి 23,689.60 వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఒక దశలో సెన్సెక్స్ 1,073 పాయింట్ల వరకు లాభపడగా, నిఫ్టీ 364 పాయింట్ల మేర పెరిగింది. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 2.74 శాతం, నిఫ్టీ హెల్త్‌కేర్ 2.56 శాతంతో టాప్ గెయినర్లుగా నిలిచాయి. మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కూడా లాభపడ్డాయి. అయితే, టెక్నాలజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతం నష్టపోయింది. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా వంటి ప్రధాన ఐటీ కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు బాండ్ల పై పన్నుల విధానాన్ని



సులభతరం చేయడం వంటి చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్న వార్తలతో మార్కెట్లు పుంజుకున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అదే సమయం లో, ట్రంప్-షీ సమావేశం తర్వాత మెరుగైన అంతర్జాతీయ ఆర్థిక సహకారంపై ఆశలు కూడా సానుకూల ప్రభావం చూపాయి.

# టెన్షన్ మధ్యే భారత్‌కు వంటగ్యాస్..
## హర్మూజ్ జలసంధిని దాటిన రెండు ఎల్‌పీజీ నౌకలు



తెలంగాణ పత్రిక మే 14

అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, పర్షియన్ గల్ఫ్ నుంచి భారత్‌కు వంటగ్యాస్ (ఎల్‌పీజీ) తీసుకువస్తున్న రెండు నౌకలు వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటాయి. ఈ పరిణామంతో ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఈ సముద్ర వాణిజ్య మార్గంలో ఇంధన రవాణా క్రమంగా పునరుద్ధరణ అవుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. వివరాల్లోకి వెళితే... 'సిమి' అనే ఎల్‌పీజీ నౌక గురువారం ఒమన్ గల్ఫ్‌లోకి ప్రవేశించింది. ఈ ప్రయాణ సమయంలో తన ట్రాన్స్‌పాండర్‌ను తాత్కాలికంగా స్విచ్ ఆఫ్ చేసినట్లు సమాచారం. ఈ నౌక ఖతార్‌లోని రాస్ లఫాన్ పోర్టు నుంచి గుజరాత్‌లోని కాండ్లాకు వస్తోంది. యూఏఈలోని రువాయిస్ రిఫైనరీ నుంచి వంటగ్యాస్‌తో బయలుదేరిన 'ఎన్వీ సన్‌షైన్' అనే మరో నౌక కూడా ఈ జలసంధిని దాటిన తర్వాత సిగ్నల్స్ నిలిపివేసింది. ఈ నౌక కర్ణాటకలోని మంగళూరు వైపు ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఇరాన్‌తో కాల్పుల విరమణ ప్రయత్నాలు 'లైఫ్ సపోర్ట్‌పై' ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. అమెరికా ప్రతిపాదించిన శాంతి ఒప్పందంపై ఇరాన్ స్పందన 'పూర్తిగా ఆమోదయోగ్యం కాదు' అని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్ తమ స్పందనను పంపింది. ప్రపంచ ముడిచమురు, ఎల్ఎన్‌జీ రవాణాలో అధిక భాగం హర్మూజ్ జలసంధి నుంచే జరుగుతుంది.

## ఆటలో బంగారు గొలుసు కిందపడేసుకున్న ఆర్సీబీ బ్యాటర్...




తెలంగాణ పత్రిక మే 14

ఐపీఎల్ లో గత రాత్రి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. ఆర్సీబీ ఓపెనర్ జాకబ్ బెతెల్ ఔటయ్యే క్రమంలో తన బంగారు గొలుసును పిచ్‌పైనే జారవిడుచుకుని, అది గమనించకుండానే పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. రాయ్‌పూర్ లో జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ బౌలర్ కార్తిక్ త్యాగి వేసిన బౌన్సర్‌ను బెతెల్ పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే బంతి హెల్మెట్‌కు తగిలి గాల్లోకి లేవగా, త్యాగి సులభంగా క్యాచ్ అందుకున్నాడు. ఈ క్రమంలోనే అతని మెడలోని గోల్డ్ చైన్ తెగి పిచ్‌పై పడిపోయింది. కానీ ఔటయ్యానన్న నిరాశలో ఉన్న బెతెల్ ఈ విషయాన్ని గమనించలేదు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన దేవదత్ పడిక్కల్ పిచ్‌పై మెరుస్తున్న చైన్‌ను చూశాడు. వెంటనే దానిని చేతిలోకి తీసుకుని అంపైర్‌కు అప్పగించి తన క్రీడాస్ఫూర్తిని చాటుకున్నాడు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా, నెటిజన్లు సరదా కామెంట్లతో స్పందించారు. పడిక్కల్ స్పోర్ట్స్‌మన్‌షిప్‌ను పలువురు ప్రశంసించారు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో కేకేఆర్‌పై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ 192 పరుగులు చేయగా, ఆర్సీబీ 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. విరాట్ కోహ్లీ (105) అజేయ సెంచరీతో చెలరేగి జట్టును గెలిపించాడు. ఐపీఎల్‌లో కోహ్లీకి ఇది 9వ సెంచరీ. ఈ మ్యాచ్‌లో బెతెల్ 15 పరుగులు చేశాడు.

## ఆఫ్ఘన్ క్రికెటర్ జాద్రాన్ ప్రాణాంతక వ్యాధితో పోరాటం...



తెలంగాణ పత్రిక మే 14

తీవ్ర అనారోగ్యంతో భారత్‌లో చికిత్స పొందుతున్న తమ దేశానికి చెందిన మాజీ క్రికెటర్ షాపూర్ జాద్రాన్‌ను ఆఫ్ఘనిస్థాన్ ప్రముఖ క్రికెటర్లు రషీద్ ఖాన్, మహమ్మద్ నబీ నేడు పరామర్శించారు. హెమోఫాగోసైటిక్ లింఫోహిస్టియోసిస్ (హెచ్ఎల్‌హెచ్) అనే వ్యాధితో బాధపడుతున్న జాద్రాన్, గ్రేటర్ నోయిడాలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జాద్రాన్‌ను పరామర్శించిన అనంతరం, రషీద్ ఖాన్, మహమ్మద్ నబీ సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగ పోస్టును పెట్టారు. ఆసుపత్రిలోని చిత్రాలను పంచుకున్నారు. గ్రేటర్ నోయిడాలో చికిత్స పొందుతున్న జాద్రాన్‌ను తాను, రషీద్ ఖాన్ కలిశామని మహమ్మద్ నబీ పోస్టులో పేర్కొన్నాడు. నా ప్రియమైన సోదరుడు అరుదైన వ్యాధితో ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నాడ అని నబీ పేర్కొన్నాడు. మైదానంలో ఉంటే ఎలాంటి పోరాట పటిమను ప్రదర్శించేవాడో ఇప్పుడు జీవితంలో వ్యాధిపై అంతే ధైర్యంగా పోరాడుతున్నాడని తెలిపాడు. ఆసుపత్రి బెడ్ మీద అతనిని చూడటం బాధగా ఉందని భావోద్వేగానికి లోనయ్యాడు. అతడు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నానని పేర్కొన్నాడు. జాద్రాన్ 44 వన్డేలు, 36 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఈ 38 ఏళ్ళ పేసర్ రెండు ఫార్మాట్‌లలో 80 వికెట్లు పడగొట్టాడు. 2020లో ఆఫ్ఘన్ తరఫున చివరి మ్యాచ్ ఆడాడు.

# స్పోర్ట్స్

## ముగ్గురు కెప్టెన్ల పై వేటుకు వేళాయే?



తెలంగాణ పత్రిక మే 14

ఐపీఎల్ ప్రస్తుత సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ, మూడు ఫ్రాంచైజీలలో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వరుసగా రెండు సీజన్లలో జట్లను ప్లేఆఫ్స్‌కు చేర్చడంలో దారుణంగా విఫలమైన ముగ్గురు కెప్టెన్ల పదవులకు గండం ఏర్పడింది. ఈ నెలాఖరులో సీజన్ ముగిశాక అక్షర్ పటేల్, రిషభ్ పంత్, అజింక్యా రహానే తమ కెప్టెన్సీలను కోల్పోవడం ఖాయమని ఫ్రాంచైజీ వర్గాల సమాచారం. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఇప్పటికే అధికారికంగా ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో వరుసగా రెండుసార్లు విఫలమైన కెప్టెన్‌గా రిషభ్ పంత్ ముందున్నాడు. ఇక అజింక్యా రహానే నేతృత్వంలోని కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) కూడా దాదాపుగా రేసు నుంచి తప్పుకున్నట్లే. ఈ నేపథ్యంలో వీరి కెప్టెన్సీ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.మొత్తం మీద చూస్తే అక్షర్ పటేల్, రిషభ్ పంత్‌లకు ఆటగాళ్ళుగా డిమాండ్ ఉన్నప్పటికీ, వచ్చే మినీ వేలంలో రహానేను కొనుగోలు చేయడానికి ఏ ఫ్రాంచైజీ ముందుకు రాకపోవచ్చని అంచనా.

## శర్వానంద్ సరసన ఛాన్స్ కొట్టేసిన మానస వారణాసి!



టాలీవుడ్ స్టార్ శర్వానంద్, వరుస హిట్‌లతో దూసుకుపోతూ తన మార్కెట్‌ను పెంచుకుంటున్నారు. తాజాగా ఆయన సీనియర్ దర్శకుడు శ్రీను వైట్లతో చేతులు కలపడం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. శ్రీనువైట్ల అంటేనే మనకు గుర్తొచ్చేది కడుపుబ్బ నవ్వించే వినోదం. అయితే ఈసారి ఆయన కేవలం కామెడీకే పరిమితం కాకుండా, దానికి 'టైమ్ ట్రావెల్' అనే సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్‌ను జోడిస్తున్నారు. శర్వానంద్ టైమింగ్‌కు, శ్రీనువైట్ల మార్క్ హ్యూమర్‌కు తోడు సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తోడైతే బాక్సాఫీస్ వద్ద సరికొత్త మేజిక్ జరుగుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జులైలో సెట్స్ పైకి వెళ్లనుంది. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ఈ సినిమాను నిలపాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు తెరపడినట్లు కనిపిస్తోంది. మొదట స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ, చివరకు మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని ఖరారు చేసినట్లు సమాచారం. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో నటిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న మానసకు, శర్వానంద్ పక్కన ఇది ఒక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పాలి. ఈ కొత్త జోడీ వెండితెర పై ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఫీల్‌ను ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

# దర్శకుడిగా మారుతున్న హీరో రామ్...

- రెండు దశాబ్దాల పాటు కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్
- ఇక మెగాఫోన్ పట్టనున్న ఎనర్జిటిక్ స్టార్
- 23వ చిత్రంతో దర్శకుడిగా అదృష్టాన్ని పరీక్షించుకోనున్న వైనం



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని దర్శకుడిగా మారనున్నారు. 'దేవదాసు' చిత్రంతో హీరోగా రామ్ ప్రయాణం మొదలైంది. తనదైన నటన, చలాకీతనంతో, అదిరిపోయే డ్యాన్సులతో అభిమానులను సంపాదించుకున్నారు. రెండు దశాబ్దాల పాటు కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్ ఇప్పుడు మెగా ఫోన్ పట్టుకోనున్నారు. రామ్ హీరోగా నటిస్తున్న తదుపరి చిత్రంలో అభిమానులకు అదిరిపోయే వార్త సిద్ధమైంది. హీరోగా తన 23వ చిత్రానికి రామ్ స్వయంగా దర్శకత్వం వహించనున్నాడు. ఈ చిత్రంతో ఆయన దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన రేపు శుక్రవారం ఉదయం 10:08 గంటలకు అట్టహాసంగా వెలువడనుంది. తాను దర్శకుడిగా మారనున్నట్లు రామ్ అధికారికంగా ప్రకటించనున్నారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్టు కావడంతో, ఆయనే దర్శకత్వం చేయాలను కుంటున్నారు. ఈ చిత్రానికి సంబంధించి ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సామ్ పీఎస్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక పూర్తయ్యాక, తర్వాత రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. అభిమానులు రేపు రామ్ అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

# 'పెద్ది' సినిమాతో కొత్త బిజినెస్ లోకి హోంబలే ఫిల్మ్స్!

- ఓవర్సీస్ పంపిణీ రంగంలోకి అడుగుపెట్టిన హోంబలే ఫిల్మ్స్
- తొలి ప్రాజెక్ట్‌గా రామ్ చరణ్ "పెద్ది"ని ఎంచుకున్న సంస్థ
- హోంబలే చేరికతో సినిమాపై భారీగా పెరిగిన అంచనాలు
- ప్రపంచవ్యాప్తంగా భారీ విడుదలకు మార్గం సుగమం
- జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న "పెద్ది"



'కేజీఎఫ్', 'కాంతార', 'సలార్' వంటి భారీ విజయాలతో దేశవ్యాప్తంగా పేరు పొందిన ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మరో కీలక ముందడుగు వేసింది. నిర్మాణ రంగంలో అగ్రగామిగా ఉన్న ఈ సంస్థ, ఇప్పుడు అంతర్జాతీయ పంపిణీ రంగంలోకి అడుగుపెడుతోంది. ఈ ప్రయాణంలో తమ తొలి చిత్రంగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది'ని ఎంచుకుంది. భారతీయ కథలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు చేరవేయాలనే లక్ష్యంతో హోంబలే ఫిల్మ్స్ తన ఓవర్సీస్ పంపిణీ విభాగాన్ని ప్రారంభించింది. దీనికి నాందిగా 'పెద్ది' చిత్రాన్ని ఎంచుకోవడం విశేషం. ఈ నిర్ణయంతో రామ్ చరణ్ సినిమాకు అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ ప్రచారం లభించనుంది. హోంబలే వంటి పెద్ద సంస్థ నేరుగా పంపిణీ చేస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా కీలక దేశాల్లో భారీ స్థాయిలో విడుదల ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రామ్ చరణ్ ఇంటెన్స్ మేకోవర్, పవర్‌ఫుల్ విజువల్స్‌తో కూడిన ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. దీనికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ కూడా తోడవడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. 'పెద్ది' చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## 'జన నాయగన్' కోసం రంగంలోకి సీఎం విజయ్..

# కేన్స్ వెళ్లిన నిర్మాతకు పిలుపు!



తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర నటుడు విజయ్ తన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు మార్గం సుగమం చేసేందుకు స్వయంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. సెన్సార్ సమస్యల కారణంగా విడుదల ఆగిపోయి ప్రస్తుతం రివైజింగ్ కమిటీ వద్ద ఉన్న ఈ సినిమా అడ్డంకులను తొలగించే పని పై ఆయన దృష్టి సారించారు ఇందులో భాగంగా, ఫ్రాన్స్‌లో జరుగుతున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరైన చిత్ర నిర్మాతను తక్షణమే చెన్నైకి తిరిగి రావాలని విజయ్ సూచించినట్టుగా కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విజయ్ నటుడిగా చేస్తున్న చివరి చిత్రం కావడంతో 'జన నాయగన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో సినిమా విడుదల వాయిదా పడుతూ వచ్చింది. ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, ఒకవైపు పాలనలో సంచలన నిర్ణయాలు తీసుకుంటూనే తన సినిమా విడుదలకు ఉన్న అడ్డంకులను తొలగించాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే కేవీఎన్ బ్యానర్ నిర్మాత వెంకట్ ను కేన్స్ పర్యటన మధ్యలోనే ముగించుకుని చెన్నై బయల్దేరి రావాలని విజయ్ కోరినట్లు సమాచారం. విజయ్ పిలుపుతో నిర్మాత చెన్నైకి పయనమైనట్లు తెలియడంతో, త్వరలోనే 'జన నాయగన్' విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పరిణామంతో విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# 'మిస్టర్ ఎక్స్' (జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ




తమిళంలో రూపొందిన ఒక స్పై యాక్షన్ థ్రిల్లర్ 'మిస్టర్ ఎక్స్'. ఆర్య కథానాయకుడిగా నటించిన ఈ సినిమాలో శరత్ కుమార్ .. గౌతమ్ కార్తీక్ .. మంజూ వారియర్ .. అనఘ ప్రధానమైన పాత్రలను పోషించారు. ఏప్రిల్ 17వ తేదీన విడుదలైన ఈ సినిమా, నెల రోజులు తిరక్కముందే ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. భారీ బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమాకి, మను ఆనంద్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. చైనా రహస్యంగా అణుశక్తికి సంబంధించిన కార్యకలాపాలను నిర్వహిస్తూ ఉంటుంది. ఈ విషయంలో అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తుంది. చైనా అణు సంబంధమైన కదలికలను తెలుసుకోవడానికంటూ, భారత్ సాయంతో హిమాలయాలలోని 'నందాదేవి' పర్వతంపై ఒక డివైజ్ ను ఏర్పాటు చేస్తారు. 7 న్యూక్లియర్ క్యాప్సుల్స్ తో కూడిన డివైజ్ అది. దానిని డిజాస్టర్ గా కూడా వాడొచ్చనే విషయాన్ని భారత్ కి చెప్పకుండగా అమెరికా దాస్తుంది. అయితే 'నందాదేవి' అనే పర్వతంపై ఆ డివైజ్ ను సెట్ చేయడానికి వెళ్లిన వాళ్లంతా ప్రాణాలు కోల్పోతారు. 1965 నుంచి కూడా ఆ డివైజ్ కోసం గాలింపు జరుగుతూనే ఉంటుంది. అయితే అది రష్యాలోని మిలిటెన్ గ్రూప్ చేతికి చిక్కుతుంది. దాని విషయంలో వాళ్లు తీసుకున్న నిర్ణయం మరింత ప్రమాదకరమైనది కావడంతో, 'మిస్టర్ ఎక్స్' అడ్డుకోవడానికి ప్రయత్నిస్తాడు. అయితే చివరి నిమిషంలో వాళ్లకి పట్టుబడిపోయిన మిస్టర్ ఎక్స్, వాళ్ల స్థావరంలో బందీగా ఉండిపోతాడు. మిస్టర్ ఎక్స్ అసలు పేరు పరమేశ్వర సూర్యప్రతాప్ (శరత్ కుమార్). అతను 'రా'లో సీనియర్ ఆఫీసర్ గా పనిచేస్తూ ఉంటాడు. మాస్కోలోని షిప్ యార్డులో ఉన్న న్యూక్లియర్ డివైజ్ ను .. మిస్టర్ ఎక్స్ ను తీసుకురావలసిన బాధ్యతను 'రా' ఏజెంట్ గౌతమ్ (ఆర్య)కి అప్పగించబడుతుంది. అతను తన టీమ్ తో అక్కడికి బయల్దేరతాడు. అతని కదలికలపై కన్నేసిన అమరన్ చక్రవర్తి (గౌతమ్ కార్తీక్), ఆ డివైజ్ ను చేజిక్కించుకోవడానికి ప్లాన్ చేస్తాడు. గౌతమ్ నేపథ్యం ఏమిటి? అతని జీవితంలో 'కీర్తన' ( అనఘ)కి గల స్థానం ఎలాంటిది? పరమేశ్వర సూర్యప్రతాప్ తో గౌతమ్ కి గల సంబంధం ఏమిటి? అడుగడుగునా గౌతమ్ కి అమరన్ చక్రవర్తి అడ్డుపడటానికి గల కారణం ఏమిటి? అణు సంబంధమైన ఒక పెద్ద ప్రమాదం నుంచి ఈ దేశాన్ని కాపాడటం కోసం గౌతమ్ చేసే ప్రయత్నాలలో ఆయనకి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? అనేది మిగతా కథ. దేశ రక్షణకి సంబంధించిన ఒక ఆపరేషన్ చుట్టూ తిరిగే కథ ఇది. లవ్ .. ఎమోషన్ .. యాక్షన్ అనే మూడు ప్రధానమైన అంశాలను కలుపుకుంటూ దర్శకుడు ఈ కథను తయారు చేసుకున్నాడు. ఢిల్లీలోని 'రా' ప్రధాన కార్యాలయం .. చెన్నై .. రష్యా నేపథ్యంలో ఈ కథ పరిగెడుతుంది. హీరో .. విలన్ .. 'రా' టీమ్ ఈ కథలోని ప్రధానమైన పాత్రలుగా కనిపిస్తాయి. ప్రతి పాత్రను రిజిస్టర్ చేయడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. హీరో చెల్లెలి సెంటిమెంట్ కి కట్టుబడి ఉంటాడు. అలాగే తన తండ్రిని విపరీతంగా ద్వేషిస్తూ ఉంటాడు. అందుకు సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ ను వెంటనే చెప్పకుండా ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తించాడు. ఇక ఒక సాధారణ కుటుంబానికి చెందిన కుర్రాడు, విలన్ గా మారడానికి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ కూడా కాస్త బలంగానే కనిపిస్తుంది. ఆ వైపు నుంచి కూడా ప్రేక్షకులు సంతృప్తి చెందుతారు. ఏ తండ్రినైతే హీరో ద్వేషిస్తూ వచ్చాడో .. అదే తండ్రి కోరికను నెరవేర్చడం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టడమే ఈ కథలో మరింత బలమైన అంశంగా అనిపిస్తుంది. ఇక ఏ కథనైనా నెక్స్ట్ లెవెల్ కి చేర్చేవి ట్విస్టులే. అలాంటి ట్విస్టులు ఈ కథలోను అక్కడక్కడా కనిపిస్తాయి. కాకపోతే అవి ఆడియన్స్ కి అంత షాకింగ్ గా ఏమీ అనిపించవు. కాస్త సినిమా నాలెడ్జ్ ఉన్నవాళ్లు ఈజీగా గెస్ చేయవచ్చు కూడా. స్పై యాక్షన్ సినిమాలలో ప్రధానమైనవిగా కనిపించేవి యాక్షన్ ఎపిసోడ్స్. కాల్పులు .. ఛేజింగులు .. ఫైటింగులు ఒక రేంజ్ లో ఉండాలి. అప్పుడే జోనర్ కి తగిన అవుట్ పుట్ వచ్చిందని ఆడియన్స్ భావిస్తారు. అలా చూసుకుంటే ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్ లు గట్టిగానే డిజైన్ చేశారు. అందుకు సంబంధించిన ఎపిసోడ్స్ పెర్ఫెక్ట్ గానే వచ్చాయని చెప్పాలి. కాకపోతే లవ్ .. ఫ్యామిలీ ఎమోషన్స్ పెద్దగా ప్రభావితం చేయలేకపోయాయి. స్పై యాక్షన్ సినిమాలు అనగానే, కథ అనేక దేశాలను చుట్టి రావలసి ఉంటుంది. అందుకు అయ్యే బడ్జెట్ కూడా భారీగానే ఉంటుంది. ఆ విధమైన భారీతనం ఈ సినిమాలో మనకి కనిపిస్తుంది. క్వాలిటీ విషయంలో రాజీ పడలేదనే చెప్పాలి. ఆర్టిస్టులంతా చాలా నేచురల్ గా చేశారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143